మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 23-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 174 Issue: 174

23 డిసెంబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:46 సూర్యాస్తమయం - సా. 5:44 తిథిః తదియ మ. 12:11 వరకు తరువాత చవితి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం శ్రవణ ఉ. 6:58o వరకు యోగం వృఘతా సా. 4:23 వరకు కరణం గరజి మ. 12:11 వరకు వనిజ రా. 12:42o వరకు వర్జ్యం ఉ. 9:48 నుండి ఉ. 11:30 వరకు దుర్ముహూర్తం ఉ. 8:58 నుండి ఉ. 9:41 వరకు రా. 10:57 నుండి రా. 11:49 వరకు రాహుకాలం మ. 2:59 నుండి సా. 4:21 వరకు యమగండం ఉ. 9:30 నుండి ఉ. 10:53 వరకు గుళికాకాలం మ. 12:15 నుండి మ. 1:37 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:10 నుండి తె. 5:58 వరకు అమృత ఘడియలు రా. 8:01 నుండి రా. 9:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:37 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




2

## ఆస్తి పన్ను బకాయి చెల్లింపులో రాయితీ


### హైదరాబాదీలకు జీహెచ్ఎంసీ గుడ్ న్యూస్

హైదరాబాద్ నగరంలో నివసించే ఇంటి యజమానులకు, వ్యాపార సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన అవకాశాన్ని కల్పించింది. ఏళ్ల తరబడి పేరుకు పోయిన ఆస్తి పన్ను బకాయిలను వదిలించుకోవడానికి 'వన్ టైమ్ స్కీమ్' ను పునరుద్ధరించింది.



## 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. నదీజలాలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై సమావేశాల్లో చర్చించనున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై కూడా చర్చ జరగనుంది. సభలో పలు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. గోదావరి కృష్ణా జలాలే ప్రధాన ఎజెండాగా ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు తెలుస్తోంది.



## విద్యుత్తు ఉద్యోగులకు సంక్రాంతి కానుక

### 17.651 శాతం డీఏ ఖరారు

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణలోని విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సంక్రాంతి కానుకంగా డీఏను ఖరారు చేసింది. విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డీఏ ఖరారు చేస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆమోదం తెలిపారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న ధరల సూచి ఆధారంగా ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలలో డియర్ నెస్ అలవెన్స్/డియర్ నెస్ రిలీఫ్‌ను సమీక్షిస్తూ విడుదల చేస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం తరువాయి 2 వ పేజీలో...



## ముగిసిన ముర్ము శీతాకాల విడిది

### హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ముర్ము

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి వెళ్లిపోయారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తరువాయి 2 వ పేజీలో...



# రెవెన్యూ కొత్తగా!

## ఒకే గొడుకు కిందికి రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే

### భూభారతి పోర్టల్‌తో అనుసంధానం

### జనవరిలో ప్రజలకు అందుబాటులోకి కొత్త వ్యవస్థ

### ఒకే మోడల్‌గా కొత్త ఎమ్మార్వో ఆఫీస్‌లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటన్నింటిని భూ భారతి పోర్టల్‌తో అనుసంధానం చేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒక్క క్లిక్‌తో రైతులకు పూర్తి భూ సమాచారం తెలియజేసేలా వ్యవస్థను రూపొందించనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): 'భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా వేగవంతంగా అందించడానికి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే ప్లాట్ ఫామ్ మీదకు తీసుకు వచ్చి భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. వచ్చే జనవరి నెలలో ఆధునీకరించిన ఈ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నాంపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడారు. భూ పరిపాలనకు కేంద్రమైన సీసీఎల్ఏ కార్యాలయం నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్‌కు ధీటుగా ఆఫీసును ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో మరోసారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తానని...అప్పటివరకు కొంతమార్పు కనిపించాలని అన్నారు. వరుసగా విభాగాల వారీగా సమీక్షించడం కూడా జరుగుతుందని ఇందుకు సంబంధించి తరువాయి 2 వ పేజీలో...

## మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు!?

### ఫిబ్రవరిలో ఆర్బీఐ కీలక నిర్ణయం!

### గృహ రుణ గ్రహీతలకు గుడ్ న్యూస్.. యూబీఐ నివేదికలో వెల్లడి

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరిలో జరిగే మానిటరీ పాలసీ కమిటీ భేటీలో రెపోరేట్లను మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) తన రిపోర్టులో పేర్కొంది. ఒకవేళ ఈ రిపోర్టులో చెప్పినట్లుగా జరిగితే రేపోరేటు 5 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. ఆర్బీఐ మానిటరీ పాలసీ సమావేశం 2026 ఫిబ్రవరి 4-6 తేదీల్లో జరగనుంది. ఈ సమావేశంపై పలు మార్కెట్ వర్గాలు తీవ్ర ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి.



న్యూఢిల్లీ: ఇప్పటికే డిసెంబర్ నెలలో జరిగిన మానిటరీ పాలసీ సమావేశంలో 25 బేసిస్ పాయింట్లు తగ్గించి ప్రస్తుతం రెపోరేట్ 5.25 శాతం వద్ద ఉంది. ఇప్పుడు మరింత తగ్గిస్తే రిపోరేటు 5 శాతానికి పడిపోయే అవకాశం ఉంది. దీనిపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిపోర్టులో ఒక ప్రధాన కారణం పేర్కొన్నారు. అందులో ప్రస్తుతం దేశంలో ద్రవ్యోల్బణం ఎక్కువగా లేదని, ధరలు నియంత్రణలో ఉండటం వల్ల వడ్డీ రేట్లు తగ్గించడానికి అవకాశం ఉందని నివేదిక చెబుతోంది. కేవలం బంగారం ధరలు భారీగా పెరిగిన ఒత్తిడి తప్ప, దానికి సంబంధించిన 50 బేసిస్ పాయింట్ల ప్రభావాన్ని తీసి చూస్తే ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని ఈ రిపోర్టులో పేర్కొంది. ఇదే వడ్డీ రేట్లు తగ్గించడానికి ఒక బలమైన కారణం అయ్యే అవకాశం ఉందని యూనియన్ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,615 |
| వెండి (గ్రాము): | రూ.231 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,915 |



గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల విధులు, బాధ్యతలకు సంబంధించి సమగ్ర సమాచారంతో రూపొందించిన గ్రామ 'పంచాయతీ ప్రజా ప్రతినిధుల కరదీపిక'ను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ తదితరులు

## పరిషత్ క్లీన్ స్వీప్ చేద్దాం

### త్వరలో రిజర్వేషన్ల ఖరారుపై నిర్ణయం

### సర్పంచులతో మంత్రుల సమ్మేళనాలు

### కేసీఆర్ ఆరోపణలను తిప్పికొట్టాలి

### మంత్రులతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసే దిశగా పనిచేయాలని మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తన మంత్రివర్గ సహచరులతో భేటీ అయిన ఆయన.. వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. 2



జగిత్యాల జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీ మల్యాలలో సర్పంచ్‌గా ప్రమాణం చేస్తున్న బొట్ల జయ ప్రసాద్

## నమస్తే సర్పంచ్ సాబ్

### కొలువుదీరిన పంచాయతీ పాలక వర్గాలు.. రాష్ట్రంలో ముగిసిన స్పెషలాఫీసర్ల పాలన

రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరాయి. ప్రతి గ్రామంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు ప్రమాణం చేశారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు 12,702 గ్రామ పంచాయతీల్లో ప్రమాణ స్వీకారోత్సవాలు జరిగాయి. 2


(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు కొత్త కళను సంతరించుకున్నాయి. ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే.. నూతన సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ తొలి సమావేశం తరువాయి 2 వ పేజీలో...

## జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవో జారీ

### రెండు వర్గాలుగా జర్నలిస్టులు

### ఈసారి డిజిటల్ మీడియాకూ చోటు




హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల జారీపై ఎట్టకేలకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ, 'తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025'ను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో (జీవో నంబర్.252) జారీ చేసింది. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. అదే విధంగా కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాతవే కొనసాగుతాయి.

#### నిబంధనలు ఇవీ..

అక్రెడిటేషన్ కార్డు, మీడియా కార్డు:

అక్రెడిటేషన్ కార్డు: ఇది ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా ఉపయోగపడుతుంది.

తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



యూకేకు చెందిన జాషువా ఆండ్రూ అనే అబ్బాయి తన తండ్రిని రెండు సార్లు రక్షించాడు. గతంలో క్యాన్సర్ బారిన పడ్డ తన తండ్రి డేవిడ్‌ను కాపాడుకొనేందుకు ఎముక మజ్జను దానం చేయగా, ఈ మధ్య కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న తన తండ్రి కోసం మరోసారి తన కిడ్నీని అందజేశాడు. ప్రస్తుతం వీరిద్దరు ఆరోగ్యంగా ఉన్నారు.



## పైసలతో రేవంత్ పదవులు

### అంగీల్లా పార్టీ మారే వ్యక్తిత్వం నీది.. సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర ప్రయోజనాల గురించే మాట్లాడారని అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు ఈరోజు మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై హరీశ్‌రావు స్పందించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టి సాధించిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించిందని అన్నారు. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా నిలిపారని చెప్పారు. 3 రేట్ల జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం పెరిగిందని -2 వ పేజీలో...



## కొండగట్టు గుట్ట అంజన్నకే!

### ప్రజావాణిలో కలెక్టర్‌కు వీహెచ్‌పీ వినతి

### సానుకూలంగా స్పందించిన కలెక్టర్! 2

### 3న టీటీడీ భవనానికి పవన్ శంకుస్థాపన!

## రాశి ఫలాలు

23.12.2025

మేషం: ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత అధికమవుతుంది. ఉద్యోగాలు ఊహించని స్థానచలన సూచనలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

వృషభం: చిన్ననాటి మిత్రులతో కీలక విషయాలు చర్చిస్తారు. వ్యాపార విస్తరణకు నూతన పెట్టుబడులు అందుతాయి. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగుల ఆశలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో సహోద్యోగుల సహాయంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాల్లో లాభాలు అందుకుంటారు.

మిధునం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార వ్యవహారాలలో సొంత నిర్ణయాలు కలసి వస్తాయి. ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. ఇంటాబయట నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

కర్కాటకం: బంధువర్గం నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు చికాకు పరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

సింహం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యయ ప్రయాసలతో కొన్ని పనులు పూర్తి కావు. వృధా ఖర్చులు విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కన్య: సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగమున మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

తుల: సమాజంలో ప్రత్యేక గౌరవ మర్యాదలు పొందుతారు. నిరుద్యోగులు ఆశించిన పురోగతి సాధిస్తారు. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. చేపట్టిన పనులలో అవరోధాలు తప్పవు. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలు కాస్త నిరాశ కలిగిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దూరపు బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి.

ధనస్సు: ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా వేస్తారు. రుణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. బంధువులతో అకారణ విభేదాలు కలుగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహ పరుస్తాయి. ఉద్యోగ స్థానచలన సూచనలున్నాయి.

మకరం: దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది.

కుంభం: బంధువులతో అకారణ విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. చేపట్టిన పనులలో కొంత జాప్యం కలుగుతుంది. ఉద్యోగమున అధికారుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వ్యాపారాలలో సమస్యలు తప్పవు స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

మీనం: వ్యాపారాల్లో అంచనాలు నిజం కాగలవు. పనులు చకచకా పూర్తి చేస్తారు. ఉద్యోగమున మీ పనితీరుతో అధికారులను సైతం ఆకట్టుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహాన్నిస్తాయి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు విస్తృతమవుతాయి.

# కొండగట్టు గుట్ట అంజన్నకే!

**ప్రజావాణిలో కలెక్టర్‌కు వీహెచ్‌పీ వినతి**

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్!**

**3న టీటీడీ భవనానికి పవన్ శంకుస్థాపన!**

మల్యాల, డిసెంబర్ 22 (ఈవార్తలు): కొండగట్టు గుట్ట అంజన్నకే చెందాలని వీహెచ్‌పీ నేతలు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్‌కు సమర్పించిన లేఖలో.. 'కొండగట్టు ఆలయ పరిసర ప్రాంతాల్లో భూములను అటవీశాఖకు చెందినవిగా ఆ శాఖ అధికారులు మార్కింగ్ చేశారు. దీనిపై ఆలయ సిబ్బందికి గానీ, ఎండోమెంట్ ఆఫీసర్‌కు గానీ సమాచారం ఇవ్వలేదు. కొండగట్టు అంజన్న భక్తులు, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా అంజన్న ఆలయానికి మార్కింగ్ చేయడం బాధాకరమైన విషయం. టీటీడీ 100 గదుల వసతి గృహం పనులను అడ్డుకొనేలా అటవీశాఖ అధికారులు వ్యవహరించడం అభ్యంతరకరం. ఏపీలోని శ్రీశైలం ఆలయానికి అక్కడ ఉన్న అటవీశాఖ భూములను ఏ విధంగా అటాచ్ చేశారో, కొండగట్టు ఆలయం విస్తీర్ణం కోసం కొండగట్టు ఆలయం చుట్టూ ఉన్న అటవీ భూములను అటాచ్ చేసేలా చర్యలు చేపట్టాలి' అని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు వీహెచ్‌పీ నేతలు తెలిపారు. ఆలయం కోసం ఇంకా వందెకరాలైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపినట్లు వెల్లడించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడితో పాటు కస్తూరి రాజం, వూటూరి రాధాకృష్ణరెడ్డి, ఎం రాములు, యాగండ్ల లక్ష్మీనారాయణ, ఎదురుగట్ల పరందాం, ఏ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

**ఆర్డీవో భేటీ**

కొండగట్టు ఆలయ భూములపై ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, డీఎఫ్‌వో సమక్షంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ సమావేశం నిర్వహించారు. అటవీశాఖ, ఎండోమెంట్ శాఖల హద్దులను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేవాదాయ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ పరిధిలోని భూములపై జాయింట్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీవోకు ధర్మపురి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు పూర్తి నివేదిక అందజేశారు. కొడిమ్యాల రేంజ్ ఆఫీసర్ సమావేశానికి గైర్హాజరు కావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**3న టీటీడీ భవనానికి పవన్ శంకుస్థాపన!**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనవరి 3న కొండగట్టును సందర్శించి, టీటీడీ అతిథి గృహానికి శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. కొండగట్టులో 100 గదులతో కూడిన అతిథి గృహం, 2,000 మంది కూర్చునే సామర్థ్యంతో దీక్షా మండపాన్ని నిర్మించేందుకు టీటీడీ సన్నాహాలు చేస్తోంది. ఇటీవల జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఒక తీర్మానం ఆమోదించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, జూన్ 29న పవన్ కల్యాణ్ కొండగట్టు ఆలయాన్ని సందర్శించి, నిర్మాణాల కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఆ సమయంలో ఆలయ అధికారులు, పూజారులు ఆయనకు ఆలయంలో తగినంత అతిథి గృహ సౌకర్యాలు లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. టీటీడీ ద్వారా 100 గదుల అతిథి గృహం 2,000 మంది సామర్థ్యం గల హాలు నిర్మించాలని కోరుతూ ఒక వినతిపత్రం సమర్పించారు. దీంతో పవన్ చొరవతో వసతి గృహ నిర్మాణానికి టీటీడీ ఆమోదం తెలిపింది.

# రెవెన్యూ కొత్తగా!

**మొదటి పేజీ తరువాయి**

అధికారుల పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. 'దశాబ్దాల క్రితం ప్రభుత్వం వివిధ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ జరిపిందని... ఇప్పటికీ కొన్ని భూములు ప్రైవేటు వ్యక్తుల పేరు మీదే ఉన్నాయని ఇవన్నీ కూడా రికార్డులలో మార్చాలని, అలాగే అసైన్డ్ , భూధాన్ భూములపై సమీక్షతో పాటు కొన్ని సంవత్సరాల నుంచి ఉద్యోగులపై విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఏ విభాగంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి., ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులన్నింటిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తా'అ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగానిర్మించబోయే తహశీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌గా ఉండాలని ఇందుకు సంబంధించిన డిజైన్ రూపొందించాలని అధికారులకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. 'ఒక్క క్లిక్‌తో రైతుకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా అదేవిధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్ , గ్రామాల నక్షా, ఫీడ్ బ్యాక్ వంటి పూర్తి సమాచారం లభించేలా సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలతో అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావాల్సిన సమాచారం లభిస్తుందన్నారు. క్రయ విక్రయదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్‌ను రూపొందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తాం' రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ చేసే ప్రతిపనిలో సామాన్యుని కోణం ఉండాలని ఎలాంటి లోపాలకు, తారుమారుకు ఆస్కారం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, సీసీఎల్‌ఏ ఇన్‌చార్జి కార్యదర్శి మంధా మకరంద్, ఎన్ఐసీ ఎస్ఐఓ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవో జారీ

**మొదటి పేజీ తరువాయి**

మీడియా కార్డు: డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే ఈ కార్డులు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందేందుకు మాత్రమే పనికివస్తాయి.

డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు:

డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రెడిటేషన్ ఇవ్వాలంటే సదరు వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది విజిటర్స్ ఉండాలి. దీనితో పాటు రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తారు.

అర్హతలు:

న్యూస్ పేపర్లు: కనీసం 2,000 ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రెడిటేషన్‌కు అర్హులుగా ప్రభుత్వం జీవోలో తెలిపింది. దీనిలో పీఆర్‌జీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

ఎలక్ట్రానిక్ మీడియా: శాటిలైట్ చానళ్లు 50 శాతం వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.

జర్నలిస్టుల అర్హత: స్టేట్ లెవల్ అక్రెడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి.

నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.

ఫ్రీలాన్స్ అండ్ వెటరన్ జర్నలిస్టులు:

15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కమిటీల నిర్మాణం:

రాష్ట్ర కమిటీ: మీడియా అకాడమీ చైర్మన్ చైర్మన్‌గా, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ కో-చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, పీసీఐ సభ్యులు ఉంటారు.

జిల్లా కమిటీ: జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఆర్వో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

నిబంధనల ఉల్లంఘన చేస్తే చర్యలు: అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుంది.

# విద్యుత్తు ఉద్యోగులకు సంక్రాంతి కానుక

**మొదటి పేజీ తరువాయి**

జూలై 1 నుంచి అమలయ్యేలా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ/డీఆర్‌ను 17.651 శాతంగా ఖరారు చేశారు. తాజా ఉత్తర్వులతో విద్యుత్ సంస్థల పరిధిలోనికి 71,387 వేల మంది ఉద్యోగులు, ఆర్టిజెన్లు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. టీజీ ట్రాన్స్ కోలో 3,036 మంది ఉద్యోగులకు, 3,769 మంది ఆర్టిజన్లకు, 2,446 మంది పెన్షనర్లకు మొత్తంగా 9,251 మందికి లబ్ధి చేకూరనుంది. జెన్ కో విషయానికి వస్తే 6,913 మంది ఉద్యోగులకు 3,583 మంది ఆర్టిజన్లకు, 3,579 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. ఎస్పీడీసీఎల్ లో 11,957 మంది ఉద్యోగులకు 8,244 మంది ఆర్టిజన్లకు, 8,244 మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. ఎన్పీడీసీఎల్ పరిధిలో 9,728 మంది ఉద్యోగులకు 3,465 మంది ఆర్టిజన్లకు, 6,115 మంది పెన్షనర్లకు బెనిఫిట్ జరగనుంది. మొత్తంగా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు కలిపి 71,387 మందికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.

# నమస్తే సర్పంచ్ సాబ్

**మొదటి పేజీ తరువాయి**

జరిగింది. తమకు ఓటేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ పాలకవర్గాలు తీర్మానం చేశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలక వర్గాలు ఏర్పాటు కావడంతో గ్రామ పంచాయతీ పాలన బాధ్యతల నుంచి స్పెషల్ ఆఫీసర్లు తప్పుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు పల్లెల్లో పాలన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో జరిగింది. తాజాగా, పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో గ్రామాల్లో వాతావరణం సందడిగా మారింది.

# ముగిసిన ముర్ము శీతాకాల విడిది

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

## ఆస్తి పన్ను బకాయి చెల్లింపులో రాయితీ

**హైదరాబాదీలకు జీహెచ్‌ఎంసీ గుడ్ న్యూస్**

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో నివసించే ఇంటి యజమానులకు, వ్యాపార సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన అవకాశాన్ని కల్పించింది. ఏళ్ల తరబడి పేరుకు పోయిన ఆస్తి పన్ను బకాయిలను వదిలించుకోవడానికి 'వన్ టైమ్ స్కీమ్'ను పునరుద్ధరించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ జీఓ నంబర్ 869ను విడుదల చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. చాలామంది ఆర్థిక ఇబ్బందుల వల్ల లేదా ఇతర కారణాల వల్ల సకాలంలో ఆస్తి పన్ను చెల్లించలేకపోతుంటారు. కాలక్రమేణా ఆ అసలు సొమ్ముపై వడ్డీ పెరిగిపోయి తడిసి మోపెడవుతుంది. అటువంటి వారి కోసం ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. దీని ద్వారా పాత బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో ఏకంగా 90 శాతం వరకు రద్దు చేస్తారు. పన్ను బకాయి అసలు సొమ్ముతో పాటు.. కేవలం మిగిలిన 10 శాతం వడ్డీని మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

# పైసలతో రేవంత్ పదవులు

**మొదటి పేజీ తరువాయి**

హరీష్ రావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక అరాచకత్వం జరిగిందని రేవంత్ ఆరోపించారని, రాజకీయాల కోసం రాష్ట్రం పరువు తీయొద్దని ఆయనను కోరుతున్నానని తెలిపారు.సొంత పార్టీ నేతలనే తొక్కుకుంటూ ఎదిగినట్లు రేవంతరెడ్డే స్వయంగా చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రూ.50 కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి పీసీసీ పదవిని కొనుగోలు చేసినట్లు గతంలో కోమటిరెడ్డి చెప్పారని అన్నారు. 'ఒక పార్టీ అనేది తల్లిలాంటిది. పార్టీ అధ్యక్షుడు తండ్రి లాంటి వారు. 25 ఏళ్లుగా ఒక రాజకీయ పార్టీలో నిజాయితీగా, నిక్కచ్చిగా నాయకుడి అడుగుజాడల్లో త్యాగాల పునాదుల మీద ఎదిగిన నాయకత్వం మాది. నువ్వేమో (రేవంత్ రెడ్డి) చదివింది బీజేపీలో, పెరిగింది టీడీపీలో, నౌకరి కాంగ్రెస్‌లో చేస్తున్నానని చెబుతున్నారు. పుట్టుక ఒక దాంట్లో, సదువు ఒక దాంట్ల, ఉద్యోగం ఒక దాంట్ల ... రేపు ఎక్కడ ఉంటావో తెలియదు. నీకు నీతి, విలువలు ఏమైనా ఉన్నాయా?, పైసలు పెట్టి పదవులు కొట్టావు.. చొక్కాలు మార్చినంత సులువుగా పార్టీ మార్చే వ్యక్తి రేవంత్ రెడ్డి.. మా నాయకుడు ఆదేశిస్తే పదవుల్ని గడ్డిపోచలా వదిలేశాం. కానీ వెన్నుపోట్లు పొడిచిన చరిత్ర రేవంత్ రెడ్డిది' అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు!?

**మొదటి పేజీ తరువాయి**

బ్యాంక్ ఆఫ్ ఇండియా రిపోర్టులో పేర్కొన్నారు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కనుక వడ్డీ రేట్లు మరో 25 బేసిస్ పాయింట్లు కనుక తగ్గించినట్లయితే, దీని ప్రభావం రియల్ ఎస్టేట్ రంగం, ఆటో రంగం పైన భారీగా పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో వడ్డీ రేట్లు తగ్గించడం వల్ల కస్టమర్లు బ్యాంకులకు చెల్లించాల్సిన నెలవారీ వాయిదాల ఈఎంఐ తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో కస్టమర్లు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి ఆసక్తి చూపించే అవకాశం ఉంటుంది. అలాగే కొత్త కార్లు, బైకులు కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. వడ్డీ రేట్లు తగ్గడం వల్ల ఫైనాన్స్ పద్ధతిలో కార్లు బైకులు కొనుగోలు చేసేవారికి నెలనెలా చెల్లించాల్సిన భారం తగ్గుతుంది. అయితే మరోవైపు బ్యాంకుల్లో ఫిక్స్ డిపాజిట్ చేసే వారికి మాత్రం వడ్డీ భారీగా తగ్గే అవకాశం ఉంటుంది.

## విద్య, ఉద్యోగవాణి

### మే 12 నుండి ఎప్‌సెట్

వివిధ ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్స్ 2026 షెడ్యూల్‌ను ఏపీఎస్‌సీహెచ్‌ఈ విడుదల చేసింది.

ఆయా సెట్ల పరీక్షల తేదీలు

ఎప్‌సెట్ ఇంజనీరింగ్: 12, 13, 14, 15, 18

ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ: మే 19, 20

ఈసెట్: ఏప్రిల్ 23

ఐసెట్: ఏప్రిల్ 28

లా, ఎడ్‌సెట్స్: మే 4

పీజీఈసెట్: ఏప్రిల్ 29,30, మే 02

పీజీసెట్: మే 5,8,9,10,11

# త్వరలో రిజర్వేషన్ల ఖరారుపై నిర్ణయం

**సర్పంచులతో మంత్రుల సమ్మేళనాలు.. కేసీఆర్ ఆరోపణలను తిప్పికొట్టాలి.. మంత్రులతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసే దిశగా పనిచేయాలని మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సోమవారం తన మంత్రివర్గ సహచరులతో భేటీ అయిన ఆయన.. రాజకీయ వ్యూహాలపై కీలక దిశానిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన పునాది అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లతో మంత్రులు నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి, వారిని ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో కొందరు కొన్ని పొరపాట్లు చేశారని.. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వాటిని రిపీట్ చేయవద్దని మంత్రులకు సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రతిపక్ష నేత కేసీఆర్ చేస్తున్న విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అటు.. ఈ భేటీలో బీసీ సామాజిక వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల నిర్వహణపైనా ఈ సమావేశాల్లోనే స్పష్టత ఇవ్వనున్నట్లు సమాచారం.



# సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు







## తెలంగాణను కమ్మేసిన తీవ్రమైన చలిగాలులు

**సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 5 డిగ్రీల ఉష్ణోగ్రత**

**17 జిల్లాల్లో 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు**

**ఏడు జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ**

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లెలో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 8.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో 8.7, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 9.5, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఏడు జిల్లాలకు కోల్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో సహా 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం వేళ పొగమంచు కురిసే అవకాశం ఉందని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28, 13 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది.

## అమెరికాలో గుండెపోటుతో నల్లగొండ యువకుడు మృతి

నల్లగొండ, డిసెంబర్ 22 (ఈవార్తలు): అమెరికాలో నల్లగొండ జిల్లాకు చెందిన యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. నల్లగొండ మండలం మేళ్లదుప్పలపల్లికి చెందిన పవన్ కుమార్ రెడ్డి (24) అమెరికాలో మృతి చెందాడు. శుక్రవారం అతను స్నేహితులతో సరదాగా గడిపాడు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. పవన్ కుమార్ రెడ్డి రెండేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. ఒక కంపెనీలో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. మరో రెండో నెలల్లో ఎంఎస్ పూర్తి చేసుకోనున్నాడు. ఇలాంటి సమయంలో చిన్న వయస్సులో అతను గుండెపోటుతో మృతి చెందడంతో అతని స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## స్కాలర్ షిప్ బకాయిలు 365.75 కోట్లు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణలోని విద్యార్థులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. స్కాలర్ షిప్ బకాయిల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు తీపికబురు చెప్పింది. స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేసింది. ఈ మేరకు సంక్షేమ శాఖలలో పెండింగ్ లో ఉన్న బకాయిలు అన్ని ఒకేసారి విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లుల బకాయిలు క్లియర్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ... విద్య విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. కేవలం విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బకాయిలకు విషయానికి వస్తే బీసీ, ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన రూ.365.75 కోట్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం మేరకు సోమవారం సాయంత్రం ఆర్థక శాఖ అధికారుల విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజాభవన్ లో ఆర్థిక, సంక్షేమ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం భట్ట విక్రమార్క సమీక్షా సమీవేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన రూ.21.62 కోట్లు, ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రూ.152.59 కోట్లు విడుదలయ్యాయి.

## జీహెచ్ఎంసీ వార్డులపై జోక్యం చేసుకోం

**హైకోర్టు స్పష్టీకరణ.. పిటిషన్ కొట్టివేత**

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): జీహెచ్ఎంసీ వార్డుల పునర్వ్యవస్థీకరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టులో విచారణ జరిగింది. జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఎంసీహెచ్ఆర్డీలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమర్పించిన నివేదిక ఆధారంగా వార్డుల పునర్విభజన చేశామని ప్రభుత్వం తెలిపింది. అయితే ఆ నివేదికను బహిర్గతం చేయలేదని, అభ్యంతరాల స్వీకరణకు తగినంత గడువు ఇవ్వలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదించారు. చట్టపరిధిలోనే డీలిమిటేషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ప్రభుత్వం తరఫు న్యాయవాది ఇటీవల కోర్టుకు వివరించారు. సమాచారం ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచామని, ఇప్పటి వరకు అందిన 3,100 అభ్యంతరాలను పరిష్కరిస్తున్నామని ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది



## మహిళలకు ఉచిత బస్ పాస్ కార్డులు

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. నిన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్ష భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని స్వాగతిస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ వెల్లడించింది. ఇక, మహాలక్ష్మీ పథకం కారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ అమాంతం పెరిగింది. ఉచిత బస్సు సౌకర్యం కోసం మహిళలు పోటెత్తుతుండడంతో జీరో టికెట్ జారీ చేసే సమయంలో కండక్టర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు జేఏసీ తెలిపింది. ఈ విషయాన్ని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాల దృష్టికి జేఏసీ తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే మే 6న రవాణా శాఖ మంత్రితో జరిగిన సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావన రావడం, దానికి మంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని పేర్కొంది. ఇక, నిన్న డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్షా సమావేశంలో మహిళలకు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది.

## న్యూ ఇయర్ సెలబ్రేషన్‌పై నిఘా పెట్టాలి

**బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ రావు**



హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో నిరోధించడానికి రాష్ట్రంలోని అన్ని పోలీస్ కమీషనరేట్ల పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచాలని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణరావు పోలీస్ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాచిగూడలోని భజరంగ్ సేన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రవీణ్ యాదవ్, సతీష్ రాజ్లతో కలిసి ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి, లాంటి పదార్థాల రవాణాను, వినియోగాన్ని అరికట్టడానికి పబ్బు, హుక్కా లాంజ్లు, రిసార్టు, ఫామ్ హౌస్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన కోరారు. యువతో పెరుగుతున్న మాదకద్రవ్య వ్యసనం గురించి ఆందోళన వ్యక్తం చేశారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం యువకులను సనాతన సంస్కృతి, సాంప్రదాయ విలువల నుండి దూరం చేస్తోందని పేర్కొన్నారు. యువతను క్రమశిక్షణ, మంచి అలవాట్లు, సాంస్కృతిక విలువల వైపు పర్యవేక్షించడం, మార్గనిర్దేశం చేయడంలో తల్లిదండ్రులు, పెద్దలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో బజరంగ్ సేన నాయకులు రాఘవ, జగదీష్, మనోజ్, సాయినాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులు రావొద్దన్నట్లు కేసీఆర్ తీరు

**మంత్రి శ్రీధర్ బాబు మండిపాటు**



హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు రావొద్దన్నట్లుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిన్న మాట్లాడారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన ఒప్పందాలను మాజీ ముఖ్యమంత్రి తక్కువ చేసి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుభవం కలిగిన నాయకుడిగా రాష్ట్ర అభివృద్ధికి ఆయన సూచనలు చేస్తారని తాము భావించామని, కానీ అందుకు భిన్నంగా పెట్టుబడులకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని బీఆర్ఎస్ నాయకత్వం కోరుకుంటున్నట్లుగా ఉందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ వేదికగా లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలు కుదిరాయని ఆయన అన్నారు. ఒప్పందం చేసుకున్న ప్రతి సంస్థ ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఒప్పందం చేసుకున్న ప్రతి పరిశ్రమ రాలేదని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. అప్పుడు తాము కూడా దానిపై రాజకీయం చేయలేదని అన్నారు. ఏ రాష్ట్రంలో లేనంత స్థాయిలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించామని అన్నారు. హైదరాబాద్ నగరానికి వచ్చేందుకు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఒక్క ఏడాదిలోనే 75 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను తీసుకువచ్చామని అన్నారు. అత్యధిక జీసీసీలు వచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి రూ.3.40 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. కొత్త పెట్టుబడులతో 1.40 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో ఎన్నో ప్రభుత్వ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రపంచ అవసరాలలో మూడొంతుల వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు.

## అదానీ, అంబానీల కోసమే నరేగా రద్దు



హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): జాతీయ ఉపాధి హామీ చట్టం స్థానంలో వీబీ జీ రామ్ జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడంపై విపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తెలంగాణ మంత్రి సీతక్క ఈ అంశంపై మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టానికి కేంద్రం మహాత్మా గాంధీ పేరును తీసేసి, ఆయనను మరోసారి హత్య చేసిందని అన్నారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అదానీ, అంబానీల మైనింగ్ తవ్వకాలకు కూలీలను సరఫరా చేసేందుకే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని సీతక్క మండిపడ్డారు. ఈ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని అన్ని గ్రామాల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ నెల 27 లేదా 28 తేదీలో ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు, వలసలను అరికట్టేందుకు గత యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే... ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీకి ఉరి వేసిందని దుయ్యబట్టారు.

## 'పంచాయతీ'లో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు

**మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపణలు**




హైదరాబాద్, డిసెంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కలిసి పనిచేశాయని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేసినా మూడింట ఒక వంతు సీట్లు కూడా గెలవలేకపోయాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క రెండేళ్ల పాలనకు రెఫరెండమని స్వయంగా కేటీఆర్ పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. తమ ప్రభుత్వంపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలు సరికాదని ఆయన అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండేళ్ల తర్వాత అధికారంలోకి రాగానే తోలు తీస్తానని కేసీఆర్ చెబుతున్నారని, కానీ ఆ పార్టీ కండలు కరిగిపోయి తోలు మాత్రమే మిగిలి ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ బలహీనపడిందని, పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవాలనే విషయం కేసీఆర్‌కు అర్థమైందని అన్నారు. కేసీఆర్ బయటకు వచ్చింది పాలమూరు ప్రాజెక్టు గురించి కాదని, బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠ కోసమని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు చేసి ఏ ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని ఆయన మండిపడ్డారు. 2023 ఎన్నికల సమయంలో ఒక మోటార్ ఆన్‌చేసి పాలమూరు ప్రాజెక్టు జాతికి అంకితమని చెప్పారని, కానీ నీటి కేటాయింపులు, అనుమతులు లేకుండానే ఆ పని చేశారని ఆరోపించారు. పర్యావరణ అనుమతులు తీసుకుంటేనే మన నీళ్లు మనం వాడుకునే పరిస్థితి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## సోషల్ వాణి



ఓ పని మీద ఘట్కేసర్ వైపు పోయింటి..! అందెశ్రీ అన్న సమాధి కూడా అక్కడే! అన్నోజిగూడ దాటి ఘట్కేసర్ సమీపిస్తున్న కొద్దీ అన్ననే కండ్లల్ల మెదిలిండు! సమాధిని చూసొద్దామని బండిని అటు మలిపిన. అక్కడ మొరం మీద అన్న బొమ్మతో ఉన్న ఓ బ్యానర్ కనిపించింది. ఆ మొరంలో సమాధి ఏడున్నదో కొంచెం సేపు వెతుక్కోవాల్సి వచ్చింది. మూడు సిమెంట్ రాళ్లు, ఓ ఎండిపోయిన పూలదండను చూసి గుర్తుపట్టిన. రాష్ట్ర ప్రభుత్వం అందెశ్రీ స్మృతి వనం కడ్తామని చెప్పింది. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అందించిన లోకకవి అందెశ్రీ అన్నను తరతరాలు యాదికుంచుకునే చాలా గొప్ప నిర్ణయం ఇది. కానీ, స్మృతి వనం నిర్మించేలోపు అక్కడ బొంద మాయమయ్యేటట్టు ఉంది. ఇప్పటికే భూమి (కొత్తగా పోసిన మొరం) లెవల్‌కు సమాధి చేరుకుంది. కనీసం ప్రహరీ కాదు కదా.. ఇంత ముండ్ల కంప కూడా సమాధి చుట్టూ లేదు. చివుక్కుమంది. బాధేసింది. నవంబర్ 10న ఇక్కడే అందెశ్రీ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. పాడె మోశారు. ఓ కవి పాడెను ఇట్ల ముఖ్యమంత్రి మోయడం ఎందరినో కదిలించింది. అన్నకు తమ్ముడిలా సీఎం రేవంత్ అన్ని కార్యక్రమాలు దగ్గరుండి చేశారు. రుణం తీర్చుకున్నారు. ఆరోజు నేను కూడా ఇక్కడే గుంపులో ఓ మూలకు ఉండి చూసిన. లోపలికి వెళ్లేందుకు తొవ్వ దొర్కలేదు. అన్న చివరిచూపు చూసే అవకాశం దక్కలేదు. మనసులోనే అన్నకు నివాళులర్పించుకొని నా దారిన నేను వెనక్కి వచ్చేసిన. మళ్లా ఇయ్యాల్నే అటు పోయింటి.. ఒంటరిగా! సమాధి వెతుకుతుంటే ఇట్ల కనిపించింది. సీఎం సార్.. మీకు, అందెశ్రీ అన్నకు మధ్య ఉన్న అనుబంధం అమూల్యం. మాటిచ్చినట్టుగానే అందెశ్రీ అన్న పాటను రాష్ట్ర గీతం చేశారు. స్మృతివనం కట్టాలన్న మీ నిర్ణయం చాలా గొప్పది. కానీ, అది కట్టేలోపు సమాధి ఆనవాళ్లు కనిపించేలా లేవు. స్మృతివనం ఏర్పాటు చేసేలోపు అక్కడి అధికారులైనా కాస్త దృష్టి పెట్టి సమాధి చుట్టూ ప్రహరీలాంటిది కట్టి సంరక్షించాలని కోరుకుంటున్న. కోరుతున్న.

- అంబట్ల రవి

# పంచాయతీల్లో 'ప్రమాణ' పండుగ



జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్‌లో కొలువుదీరిన గ్రామ పంచాయతీ పాలక వర్గం. స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రమాణం చేశారు.



మల్యాల మండలం గుడిపేట గ్రామపంచాయతీ సర్పంచ్ గా గెలుపొందిన ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి, ఉపసర్పంచ్ గొట్టె అనిత నరేష్, వార్డు సభ్యులు ప్రమాణం చేశారు.




మల్యాల మండలం ముత్యంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ గా గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన దారం ఆదిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజునే దిగువ కొండగట్టులో ఉన్న దుకాణం సముదాయాలకి లైసెన్సు రుసుము రద్దు చేశారు.




కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామంలో నూతన సర్పంచ్, పాలకవర్గం ప్రమాణం చేశాయి.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాలలో సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్న వీర్ల నర్సింగరావు.



చొప్పదండి నియోజకవర్గంలోని అనంతపల్లి నూతన సర్పంచ్‌గా ప్రమాణం చేసిన గంగాధర కావ్య లక్ష్మణ్

## కెనడా స్టార్ట్-అప్ వీసా నిలిపివేత

ఒట్టావా: కెనడా తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. తన స్టార్ట్-అప్ వీసా కార్యక్రమాన్ని నిలిపివేసింది. ఆ స్థానంలో, తమ దేశంలో వ్యాపారాలు ప్రారంభించే విదేశీయుల కోసం కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ మేరకు 2026లో పైలట్ ప్రాజెక్టు ద్వారా శాశ్వత నివాసానికి కొత్త పథకాన్ని ప్రవేశపెడుతుందని ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా తెలిపింది. స్టార్ట్-అప్ వీసా దరఖాస్తుదారులకు అందుబాటులో ఉన్న ఐచ్ఛిక వర్క్ పర్మిట్ కోసం దరఖాస్తులను ఇకపై అంగీకరించబోమని ఐఆర్‌సీసీ ఇప్పటికే ప్రకటించింది. ఇప్పటికే కెనడాలో ఉన్న తమ ప్రస్తుత ఎస్‌యూవీ వర్క్ పర్మిట్‌ను పొడిగించాలని కోరుకునే దరఖాస్తుదారులకు మాత్రమే మినహాయింపు ఉంటుందని వెల్లడించింది. ఈ నెల 31 రాత్రి 11.59 గంటలకు కొత్త స్టార్ట్-అప్ వీసా దరఖాస్తులను అంగీకరించడం నిలిపివేస్తామని కూడా డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది. అయితే, కొత్త పైలట్ ప్రాజెక్టు ప్రస్తుత స్టార్ట్-అప్ వీసా ప్రోగ్రామ్ కు ఎలా భిన్నంగా ఉంటుందో ఐఆర్‌సీసీ ఇంకా వెల్లడించలేదు. కానీ, కొత్త పథకం కెనడా దీర్ఘకాలిక ఇమ్మిగ్రేషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని పేర్కొంది.

## ఐఫోన్ల తయారీ యూనిట్‌లో మహిళలకే 80 శాతం జాబ్స్

బెంగళూరు: చైనా నుంచి వ్యవస్థలను భారత్ కు మళ్లించడానికి దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్ తన కర్ణాటక యూనిట్‌లో నియామకాలను వేగవంతం చేసింది. బెంగళూరు సమీపంలోని దేవనహల్లి ఫ్యాక్టరీలో కేవలం 8%-%9 నెలల్లోనే దాదాపు 30 వేల మంది ఉద్యోగులను నియమించుకుంది. వీరిలో అత్యధికంగా మహిళలే ఉండటం విశేషం. 300 ఎకరాల



విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ దేశంలోనే రెండో అతిపెద్ద ఐఫోన్ అసెంబ్లీ యూనిట్ గా ఉంది. ఈ యూనిట్‌లో ప్రారంభంలో ఐఫోన్ 16 మోడల్ ఉత్పత్తి జరుగుతుండగా, ఇప్పుడు ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ మోడల్స్ కూడా తయారీకి వచ్చాయి. ఉత్పత్తిలోని ఐఫోన్లలో 80 శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఫాక్స్‌కాన్ ఇప్పటికే మినీ టౌన్‌షిప్ స్థాయిలో సౌకర్యాలు అందిస్తూ, ఉద్యోగుల కోసం ఇళ్లు, వైద్య, విద్యా సదుపాయాలు ఏర్పాటు చేసింది. వచ్చే ఏడాది నాటికి సిబ్బందిని 50 వేల వరకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఫాక్స్‌కాన్ తమిళనాడు ఐఫోన్ ప్లాంట్ తర్వాత ఇది రెండో పెద్ద ప్రాజెక్ట్. తమిళనాడులోని ఫ్యాక్టరీలో 41 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలోనూ అత్యధికంగా మహిళలే ఉన్నారు. ఫాక్స్‌కాన్ డిజైన్, టెక్ విభాగాల్లో మహిళలను అగ్రగాములుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నియామకాలు చేస్తున్నట్లు వెల్లడించింది.

# అమరావతిలో కల్చరల్ సెంటర్

**ఏపీ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం**

అమరావతి, డిసెంబర్ 22 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతిలో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఒక ఆధునిక కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీని కోసం వెంటనే అనువైన భూమిని గుర్తించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో జరిగిన 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి, పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి పనులపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అమరావతిలో ఒక వేదిక ఉండాలి. రాష్ట్ర సంస్కృతికి అద్దంపట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మాణం చేపట్టాలి. నిర్దేశిత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలి. భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. వారి సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలి," అని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలోని అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసి, పర్యాటకులను



ఆకర్షించేలా పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన అంశాలు**

- అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ 2 ఎకరాల పరిధిలో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్
- అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపు.
- శాఖమూరు గ్రామంలో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం.
- హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో 6 ఎకరాలు కేటాయింపు.
- 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు.
- ఎల్పీఎస్ జోన్-8లో లే-అవుట్ల అభివృద్ధికి రూ.1358 కోట్లు కేటాయింపు.
- 202 ఎకరాల భూమి జరీబు లేదా మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు. వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, రెవెన్యూ, సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు.

# తప్పు చేస్తే ఊరుకోను

**అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దు**

**జనసేన నేతలకు పవన్ దిశానిర్దేశం**

**మంగళగిరిలో 'పదవి-బాధ్యత' సమావేశం**

మంగళగిరి, డిసెంబర్ 22 (ఈవార్తలు): నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులకు పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తే చూస్తూ ఊరుకోబోనని స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన నిర్వహించిన 'పదవి-బాధ్యత' సమావేశంలో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. "మీకు వచ్చిన పదవులను బాధ్యతగా నిర్వర్తించండి. రెండు చేతులు జోడించి కోరుకుంటున్నాను, అధికారాన్ని దుర్వినియోగం చేయకండి. మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను" అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. ఓటమిలో కూడా పార్టీ కోసం బలంగా నిలబడినందువల్లే నేడు అందరికీ పదవులు దక్కాయని ఆయన గుర్తుచేశారు. యువతకు సరైన వేదిక అందించాలనే ఉద్దేశంతోనే జనసేన పార్టీని స్థాపించానని పవన్ తెలిపారు. "కొత్త పంథాను నమ్ముకొని ఎంతోమంది యువకులు నక్సలైట్లుగా మారారు. సరైన ఐడియాలజీ లేకపోతే ఇబ్బందులు వస్తాయి. అందుకే సలసల మరిగే యువతకు జనసేన ఒక వేదిక కావాలని ఆకాంక్షించాను" అని వివరించారు. కాంగ్రెస్ నుంచి వైసీపీ ఏర్పడినప్పుడు వారికి సిద్ధంగా కేడర్ వచ్చిందని,



కానీ జనసేన మాత్రం ప్రతిదీ సొంతంగా నిర్మించుకోవాల్సి వచ్చిందని అన్నారు. జనసేన సిద్ధాంతం అందరినీ కలుపుకొనిపోయేదే తప్ప విడదీసేది కాదన్నారు. జాతీయ దృక్పథంతోనే తాను ప్రాంతీయ పార్టీని పెట్టానని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుతూనే అభివృద్ధి జరగాలని, మనం చేసే ప్రతి పని రాజ్యాంగానికి లోబడే ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## పవన్, ఎన్టీఆర్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టాలీవుడ్ అగ్రహీరో ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రకటనల కోసం వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం కలుగుతోందని పవన్, తారక్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుల్లో అమెజాన్, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే, తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది. గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత బీఎస్ఐ, ఐపీ లాగిన్ వివరాలను మూడు వారాల్లోగా అందించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది.



## కొడిమ్యాలలో గాయత్రి బ్యాంకు ప్రారంభం

కొడిమ్యాల, డిసెంబర్ 22 (ఈవార్తలు): గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 68వ శాఖ జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కొత్త శాఖను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమర్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కొడిమ్యాల ఎంపీడీవో స్వరూప, కిరణ్ కుమార్, సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, రీజనల్ హెడ్ బింగి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అధ్యక్షుడు గుండేటి గంగాధర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల బ్యాంకుగా గుర్తింపు పొంది సహకార రంగంలో స్ఫూర్తిదాయకమైన బ్యాంకుగా పనిచేస్తోందని, రూ.3855.02 కోట్ల వ్యాపారాన్ని సాధించి రాష్ట్రంలో మొదటి స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు.

## పీవీ సునీల్‌పై డీజీపీకి రఘురామ ఫిర్యాదు

**అన్ని పదవుల నుంచి రఘురామను వెంటనే తొలగించాలని డిమాండ్**

అమరావతి, డిసెంబర్ 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య వివాదం తీవ్రస్థాయికి చేరింది. రఘురామపై సునీల్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆయన్ను అన్ని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేయడం తెలిసిందే. దీనికి ప్రతిగా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న సునీల్ కుమార్‌ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలంటూ రఘురామ డీజీపీకి ఫిర్యాదు చేశారు. రఘురామకృష్ణరాజుపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందంటూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సునీల్ కుమార్... ఆయన్ను, ఆయన కుటుంబసభ్యులను అరెస్ట్ చేయడానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తి అరెస్ట్ అయితే అది రాష్ట్రానికే తలవంపులని, అమరావతి బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, నారా లోకేశ్ కష్టపడి తెస్తున్న పెట్టుబడులు వెనక్కిపోయే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయం అందరికీ సమానంగా ఉండాలని, తనను సస్పెండ్ చేసినప్పుడు రఘురామను కూడా పదవి నుంచి తప్పించాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.

## అమరావతిలో ఆవకాయ ఫెస్టివల్

**అమరావతి బ్రాండ్‌ను ప్రమోట్ చేసేందుకు నిర్ణయం**

**జనవరి 8 నుంచి 10 వరకు సాంస్కృతిక వేడుకలు**

విజయవాడ, డిసెంబర్ 22 (ఈవార్తలు): అమరావతి బ్రాండ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బలంగా నిలబెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పర్యాటక శాఖ 'ఆవకాయ' పేరుతో సరికొత్త ఉత్సవానికి శ్రీకారం చుట్టింది. సినిమా, సంస్కృతి, సాహిత్యాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఈ ఫెస్టివల్‌ను జనవరి 8 నుంచి 10 వరకు విజయవాడ కేంద్రంగా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమం వివరాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. "తెలుగు నేలపై పుట్టిన కథ, కవిత, సినిమా, సంగీతం, నాటకం వంటి అన్ని కళారూపాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే ప్రయత్నమే 'ఆవకాయ'. తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ ఉత్సవం లక్ష్యం" అని ఆయన తెలిపారు. ఏపీ పర్యాటక శాఖ, టీమ్‌వర్క్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. విజయవాడలోని పున్నమి ఘాట్, భవానీ ఐలాండ్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. సాధారణంగా ఇండోర్ హాళ్లకే పరిమితమయ్యే ఇలాంటి కార్యక్రమాలను తొలిసారిగా బహిరంగ ప్రదేశాల్లో, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడం 'ఆవకాయ' ప్రత్యేకత అని మంత్రి దుర్గేష్ వివరించారు. ఈ ఫెస్టివల్ ద్వారా తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించడంతో పాటు, సమకాలీన సృజనాత్మక ఆలోచనలకు కూడా పెద్దపీట వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కెనడాకు క్యూ

చదువులకు టాప్ డెస్టినేషన్




**న్యూఢిల్లీ: భారతదేశం నుంచి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యధికంగా 18-23 ఏళ్ల వయసు యువత (సుమారు 15.5 కోట్లు) భారత్ లోనే ఉన్నప్పటికీ, విదేశీ విద్యపై ఆధారపడటం ఎక్కువవుతోందని నీతి ఆయోగ్ సోమవారం విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది.**




**నీతి ఆయోగ్ నివేదికలో కీలక విషయాలు**

**విదేశాల్లో 13.35 లక్షల మంది భారతీయ విద్యార్థులు**

2024 నాటికి 13.35 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారని ఈ నివేదిక వెల్లడించింది. భారత విద్యార్థులు ఎక్కువగా ఇష్టపడే దేశాల్లో కెనడా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 2024లో అత్యధికంగా 4.27 లక్షల మంది విద్యార్థులతో కెనడా మొదటి స్థానంలో ఉంది.



ఆ తర్వాత అమెరికాలో 3.37 లక్షల మంది, యూకేలో 1.85 లక్షల మంది, ఆస్ట్రేలియాలో 1.22 లక్షల మంది, జర్మనీలో దాదాపు 43,000 మంది భారత విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నివేదిక 'బ్రెయిన్ డ్రెయిన్' సమస్య తీవ్రతను ఎత్తిచూపింది. 2024లో భారత్‌కు చదువుకోవడానికి వస్తున్న ప్రతి ఒక్క విదేశీ విద్యార్థికి బదులుగా, 28 మంది భారత విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. కేవలం కెనడా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లోనే 2023-24 విద్యా సంవత్సరంలో మన విద్యార్థులు ఉన్నత విద్య కోసం సుమారు రూ. 2.9 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు నివేదిక అంచనా వేసింది. లాట్వియా, ఐర్లాండ్ వంటి చిన్న యూరోపియన్ దేశాల్లో సైతం భారత విద్యార్థుల వాటా గణనీయంగా ఉండటం గమనార్హం. లాట్వియాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో 17.4 శాతం మంది భారతీయులే ఉండగా, ఐర్లాండ్‌లో ఈ సంఖ్య 15.3 శాతంగా ఉంది. ఈ వలసల వల్ల దేశం ప్రతిభావంతులను, విలువైన విదేశీ మారకాన్ని కోల్పోతోందని నివేదిక పేర్కొంది.



# రోగిని చితకబాదిన డాక్టర్

## సిమ్లాలోని ఐజీఎంసీలో ఘటన

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ (ఐజీఎంసీ)లో సోమవారం ఒక వైద్యుడు రోగిపై దాడి చేశాడని ఆరోపణలు వచ్చాయి. వైద్య పరీక్షల నిమిత్తం అర్జున్ పన్వర్ అనే వ్యక్తి ఆసుపత్రికి వెళ్ళినప్పుడు ఈ సంఘటన చోటుచేసుకుంది. సిమ్లా జిల్లాకు చెందిన అర్జున్ పన్వర్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం అతడు ఐజీఎంసీ ఆసుపత్రికి వెళ్ళాడు. ఎండోస్కోపీ కోసం ఆసుపత్రికి వెళ్లిన అనంతరం, సిబ్బంది సూచన మేరకు అర్జున్ పన్వర్ కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి ఒక ఖాళీ బెడ్‌పై పడుకున్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన వైద్యుడు తనతో అమర్యాదకరంగా ప్రవర్తించాడని అర్జున్ పన్వర్ ఆరోపించాడు. తాను మర్యాదగా ప్రవర్తించమని కోరినందుకు వైద్యుడు తనపై దాడి చేశాడని తెలిపాడు. పక్కనున్న వారు వైద్యుడిని ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ, అతడు బాధితుడిని కొడుతున్నట్లు, బాధితుడు కాలుతో వైద్యుడిని తన్నుతున్నట్లు వీడియోలో కనిపించింది. ఈ ఘటన అనంతరం రోగి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఆవరణలో నిరసన తెలిపారు. ఈ దాడిలో బాధితుడి ముక్కుకు గాయమైంది. బాధితుడు వైద్యుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడని, ఎఫ్ఐఆర్ కూడా నమోదైందని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. అయితే, తొలుత రోగే తన పట్ల అమర్యాదగా ప్రవర్తించాడని వైద్యుడు పేర్కొన్నాడు. ఈ వ్యవహారం వివాదాస్పదం కావడంతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ధని రామ్ శాండిల్ స్పందించారు. రోగి పట్ల వైద్యుడి ప్రవర్తనను ఆయన ఖండించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.


# ఛత్తీస్గఢ్ సరిహద్దులో నక్సల్స్ డంప్ ధ్వంసం

రాయ్‌పూర్: ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు దాచిపెట్టిన భారీ ఆయుధ సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన జవాన్లు, మీనాగట్ట అడవుల్లో భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలను మరియు ఆయుధాలను వెలికితీశారు. సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనితో రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని, ప్రదేశంలో మావోయిస్టులు నిల్వ చేసిన భారీ ఆయుధ గిడ్డంగిని గుర్తించారు. ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు ఉన్నాయి. వీటితో పాటు మావోయిస్టులకు సంబంధించిన యూనిఫామ్‌లు, కిట్ బ్యాగులు మరియు విప్లవ సాహిత్యాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు లభించడంతో ఆ ప్రాంతంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. మావోయిస్టులు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుడు పదార్థాలను అమర్చాలని భావించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నామని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

# కర్ణాటక సీఎంను డిసైడ్ చేసేది రాహుల్

**సిద్ధరామయ్య స్పష్టీకరణ**

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించేలా సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎం మార్పు రగడపై అగ్రనేత నేత రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన సొంతూరు మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం మార్పుపై మీడియా పదేపదే చర్చించడంపై సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. "ఈ విషయంపై ఇన్ని ప్రశ్నలు ఎందుకు? నేను ఇప్పటికే శాసనసభలో దీని గురించి మాట్లాడాను. మళ్ళీ చర్చ అనవసరం" అని అన్నారు. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానని ఇటీవల అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సిద్ధరామయ్య, తాజా వ్యాఖ్యలతో బంతిని అధిష్ఠానం కోర్టులోకి నెట్టారు. గతవారం మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయిన విషయంపై అడిగిన



ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ.. "డీకే శివకుమార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. ఆయన్ను కలవడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు. మరోవైపు, సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ఆధిపత్య పోరుపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ సమస్యను పరిష్కరించే సత్తా లేదని ఎద్దేవా చేస్తోంది. ఈ వారంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనుండటం, శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సిద్ధరామయ్యకు ఆహ్వానం అందే అవకాశం ఉండటంతో.. కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**అణురంగంలో ఇక ప్రైవేట్ భాగస్వామ్యం**

న్యూఢిల్లీ: సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్రం తాజాగా ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో ఈ బిల్లు ద్వారా అణు రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. శాంతి బిల్లు పౌర అణు రంగాన్ని నియంత్రించే ప్రస్తుత చట్టాలన్నింటినీ కలిపి ప్రైవేట్ కంపెనీలకు అవకాశం కల్పిస్తుంది. ఇది 1962 నాటి అణుశక్తి చట్టం, 2010 నాటి అణు బాధ్యత సంబంధిత చట్టాలను రద్దు చేసింది. ఇక, కొత్త చట్టం ప్రకారం ప్రైవేట్ కంపెనీలు, జాయింట్ వెంచర్లు ప్రభుత్వం లైసెన్స్‌కు లోబడి అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించవచ్చు. అలాగే సొంతం చేసుకోవచ్చు, నిర్వహించవచ్చు, తొలగించవచ్చు కూడా. అయితే, అదే సమయంలో వ్యూహాత్మక, సున్నితమైన కార్యకలాపాలు రాష్ట్ర నియంత్రణలోనే ఉంటాయని బిల్లు స్పష్టం చేస్తుంది. యురేనియం, థోరియం తవ్వకం, ఐసోటోపిక్ విభజన, ఖర్చు చేసిన ఇంధనాన్ని తిరిగి ప్రాసెస్ చేయడం, అధిక స్థాయి రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణ, భారీ నీటి ఉత్పత్తిని కేంద్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు ప్రత్యేకంగా నిర్వహిస్తూనే ఉంటాయి. శాంతి బిల్లు అమలు భారతదేశ పౌర అణు చట్రంలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వం, అణు ఇంధనానికి సంబంధించిన కీలకమైన అంశాలపై నియంత్రణను నిలుపుకుంటూనే విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తుంది. ఈ కీలక మార్పు ద్వారా ప్రైవేట్ రంగాలతో పాటు యువతకు అనేక అవకాశాలు దొరుకుతాయని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించిన విషయం తెలిసిందే.



# పాకిస్థాన్ ఎయిర్ లైన్స్‌కు ఝలక్

ఇస్లామాబాద్: ప్రైవేటీకరణకు సిద్ధమవుతున్న పాకిస్థాన్ ప్రభుత్వ విమానయాన సంస్థ పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ)కు ఫౌజీ ఫెర్టిలైజర్ కంపెనీ గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేసింది. పీఐఏలో 75 శాతం వాటా కొనుగోలుకు బిడ్డింగ్ వేసిన ఈ సంస్థ చివరి నిమిషంలో తన ప్రతిపాదనను ఉపసంహరించుకుంది. పీఐఏ ప్రైవేటీకరణకు నలుగురు బిడ్డర్లు ముందస్తు అర్హత సాధించగా, ఫౌజీ ఫెర్టిలైజర్ కంపెనీ తొలిస్థానంలో నిలిచింది. అయితే, అవసరమైన నగదు డిపాజిట్ చెల్లించాల్సిన గడువు ముగుస్తున్న సమయంలో ఈ ప్రక్రియ నుంచి వైదొలుగుతున్నట్లు ఫౌజీ ఫెర్టిలైజర్ కంపెనీ ప్రకటించింది. దీంతో ప్రస్తుతం మిగిలిన ముగ్గురు బిడ్డర్లు మాత్రమే రేసులో ఉన్నారు. వీరంతా డిసెంబర్ 23వ తేదీ నాటికి తమ సీల్డ్ బిడ్లను సమర్పించాల్సి ఉంటుందని పాక్ అధికారులు వెల్లడించారు. దిగజారిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి పాక్ ప్రభుత్వం నిధులు సమకూర్చుకుంటున్న విషయం తెలిసిందే. అయితే, ఈ నిధుల విడుదలకు షరతుగా ఐఎంఎఫ్ సూచించిన సంస్కరణలను అమలు చేసేందుకు పాక్ ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌ను ప్రైవేటీకరించాలని కీలక నిర్ణయం తీసుకుంది.

# కండోమ్స్ కోసం రూ.లక్ష ఖర్చు

**ఇన్‌స్టామార్ట్ ఆర్డర్స్ 2025 నివేదిక**



హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి నూతన మోడల్ ఐఫోన్ల కోసం 2025 సంవత్సరంలో రూ.4.3 లక్షలు ఖర్చు చేశాడని ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన క్విక్ కామర్స్ విభాగం ఇన్‌స్టామార్ట్ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈ నివేదికలో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. దేశవ్యాప్తంగా ఎక్కువగా ఆర్డర్ చేసిన జాబితాలో కరివేపాకు ఉండటం విశేషం. ఈ నివేదిక ప్రకారం, బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తి రూ.10 వెచ్చించి ప్రింటవుట్ తెప్పించుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన యువకుడు కొత్త ఐఫోన్ మోడల్స్ కోసం రూ.4 లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేశాడు. వివిధ కొనుగోళ్ల కోసం ఒక వ్యక్తి రూ.22 లక్షలు ఖర్చు చేయగా, ముంబైకి చెందిన ఒక వ్యక్తి రూ.15.16 లక్షలు విలువ చేసే బంగారం గొలుసు కొనుగోలు చేశాడు. చెన్నైకి చెందిన ఒక వ్యక్తి కండోమ్స్ కోసం ఈ ఏడాది రూ. 1 లక్ష ఖర్చు చేశాడు. దేశవ్యాప్తంగా ఆర్డర్ చేసిన ఆహార పదార్థాలలో కరివేపాకు, పెరుగు, గుడ్లు, పాలు, అరటిపండ్లు ఉన్నాయి. కొచ్చికి చెందిన ఒక వ్యక్తి 368 సార్లు కరివేపాకు కోసం ఆర్డర్ పెట్టాడు. బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తి డెలివరీ బాయ్‌కి రూ.68,600 టిప్‌గా చెల్లించడం గమనార్హం. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 11 వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల మధ్య ఎక్కువ ఆర్డర్లు వచ్చినట్లు నివేదిక పేర్కొంది.

# గృహ రుణ వడ్డీ రేట్లను తగ్గించిన ఎల్ఐసీ

న్యూఢిల్లీ: ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్) గృహ రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లను 7.15 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందిస్తోంది. ఈ తగ్గింపు నిర్ణయం నేటి నుంచి అమలులోకి వస్తుందని సంస్థ తెలిపింది. ఈ మేరకు ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఎండీ అండ్ సీఈవో త్రిభువన్ అధికారి మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఆర్బీఐ 125 బేసిస్ పాయింట్ల రెపో రేటును తగ్గించిందని తెలిపారు. ఇది గృహ రుణాలు తీసుకునే వారికి కొంత భారం తగ్గిస్తుందని ఆయన అన్నారు. 2026లోకి అడుగుపెట్టనున్న ఈ సమయంలో వడ్డీ రేట్ల తగ్గింపు గృహ రుణాల డిమాండ్‌కు ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్బీఐ ఇటీవల రెపో రేటు తగ్గించిన తరువాత పలు బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ క్రమంలో ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ కూడా రుణ గ్రహీతలకు ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని ఎల్ఐసీహెచ్ఎఫ్ఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

# పాఠ్యపుస్తకాల్లో 'సిక్కిం సుందరి' ఎందుకు లేదు?

**ఆనంద్ మహీంద్రా ఆసక్తికర పోస్ట్**

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉంటారు. స్ఫూర్తిదాయక, ఆసక్తికర విషయాలను పంచుకుంటూ నెటిజన్లను ఆకట్టుకుంటారు. తాజాగా ఆయన హిమాలయాల్లో పెరిగే ఒక అరుదైన మొక్క గురించి చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. 'సిక్కిం సుందరి'గా పిలిచే ఈ మొక్క ప్రత్యేకతలు, దాని గురించి మన పాఠ్యపుస్తకాల్లో ఎందుకు ప్రస్తావించలేదంటూ ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఈ అసాధారణమైన అద్భుతం గురించి నాకు ఇప్పటివరకు ఏమీ తెలియదు. దీని పేరు 'సిక్కిం సుందరి'. హిమాలయాల్లో 4,000 నుంచి 4,800 మీటర్ల ఎత్తులో పర్వతాల మధ్య ఒక ప్రకాశవంతమైన స్తంభంలా నిలబడి ఉంటుంది. దీని జీవితం సహనానికి ఒక గొప్ప పాఠం లాంటిది" అని మహీంద్రా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "ఈ మొక్క 7 నుంచి 30 ఏళ్ల పాటు చిన్న ఆకుల గుత్తిగా ఉండి శక్తిని నిల్వ చేసుకుంటుంది. ఆ తర్వాత తన జీవితంలో ఒక్కసారి మాత్రమే రెండు మీటర్ల ఎత్తు వరకు పెరిగి, పూలు పూసి, విత్తనాలను విడుదల చేసి మరణిస్తుంది. ఇది ఒక కావ్యం లాంటిది. కానీ, ప్రపంచంలోని వృక్షజాలం గురించి చెప్పిన మా పాఠ్యపుస్తకాల్లో దీని ప్రస్తావన ఎక్కడా లేదు. ఇప్పటి పాఠ్య ప్రణాళికలోనైనా ఈ స్థానిక అద్భుతాన్ని చేర్చారా?" అని ఆయన ప్రశ్నించారు. సిక్కిం అందాలను చూడటానికి ఇది మరో కారణం అని ఆయన వ్యాఖ్యానించారు. 'సిక్కిం సుందరి' శాస్త్రీయ నామం 'రూమ్ నోబైల్'. దీనిని 'గ్లాస్‌హౌస్ ప్లాంట్' అని కూడా పిలుస్తారు. ఈ మొక్క తన చుట్టూ పారదర్శకమైన పొరలను ఏర్పరుచుకుంటుంది. ఇవి ఒక సహజమైన గ్రీన్‌హౌస్‌లా పనిచేస్తాయి. తీవ్రమైన చలి నుంచి కాపాడటమే కాకుండా, సూర్యుడి నుంచి వచ్చే వేడిని ఒడిసిపట్టి, హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షిస్తాయి. ఈ నిర్మాణం పరాగసంపర్కానికి అవసరమైన కీటకాలను కూడా ఆకర్షిస్తుంది. జూలై-ఆగస్టు నెలల్లో ఇది పుష్పిస్తుంది.

# బిడ్డకు 'సింగపూర్' పేరు

**గాజా దంపతుల కృతజ్ఞత**

గాజా: యుద్ధం సృష్టించిన పెను విలయం, తీవ్ర మానవతా సంక్షోభం మధ్య గాజాలో ఓ అరుదైన, హృద్యమైన ఘటన చోటుచేసుకుంది. ఆపత్కాలంలో తమకు అండగా నిలిచిన సింగపూర్ దేశానికి కృతజ్ఞతగా, ఓ పాలస్తీనియన్ జంట తమ నవజాత శిశువుకు 'సింగపూర్' అని పేరు పెట్టుకుంది. ఈ వార్త ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షిస్తోంది. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 16న జన్మించిన ఈ శిశువుకు 'సింగపూర్' అని పేరు పెట్టిన విషయాన్ని 'లవ్ ఎయిడ్ సింగపూర్' అనే స్వచ్ఛంద సంస్థ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. సింగపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త గిల్బర్ట్ గోహ్ నేతృత్వంలోని ఈ సంస్థ, యుద్ధ బాధితులకు మానవతా సాయం అందిస్తోంది. కష్టకాలంలో తమ ఆకలి తీర్చి, ప్రాణాలు నిలబెట్టిన దేశం పట్ల గౌరవాన్ని, ప్రేమను చాటుకునేందుకే ఆ జంట ఈ నిర్ణయం తీసుకుంది. ఒక దేశం పేరును తమ బిడ్డకు పెట్టుకోవడం, ఆ దేశం అందించిన సాయం వారి జీవితాల్లో ఎంతటి ప్రభావం చూపిందో స్పష్టం చేస్తోంది. 2023 అక్టోబర్ నుంచి గాజా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నిరంతర దాడుల కారణంగా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, గాజాలో సుమారు 61 మిలియన్ టన్నుల శిథిలాలు పేరుకుపోయాయంటే విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సింగపూర్ వంటి దేశాలు, పలు స్వచ్ఛంద సంస్థలు అందించిన సహాయం ఎంతో మందికి ఊరటనిచ్చింది.

వయ్యారి చిత్రం


రోష్ని సర్దానా



# నారి నారి నడుమ శర్వానంద్

టాలీవుడ్ లో హీరో శర్వానంద్ డైరెక్టర్ రామ్ అబ్బరాజుతో 'నారి నారి నడుమ మురారి' సినిమా చేస్తున్నారు. లేటెస్ట్ గా రిలీజ్ అయిన టీజర్ చూస్తుంటే, ఇది శర్వానంద్ మార్క్ ఫన్ మూవీలా అనిపిస్తోంది, కానీ కథలో కొత్తదనం ఎంత ఉందనేది చూడాలి. కథ విషయానికి వస్తే, ఇది తెలిసిన పాత ఫార్ములానే గుర్తుచేస్తోంది. పెళ్లి సెటిల్ అయిన హీరో లైఫ్ లోకి సడెన్ గా ఎక్స్ లవర్ రావడం, అక్కడి నుంచి మొదలయ్యే కన్ఫ్యూజన్ డ్రామా. ఇప్పటికే చాలా సినిమాల్లో చూసిన పాయింటే అయినా, ట్రీట్మెంట్ లో ఏమైనా కొత్త మ్యాజిక్ చేస్తారా లేదా అనేది ఆసక్తికరం. హీరో ఇద్దరు అమ్మాయిల మధ్య నలిగిపోయే కాన్సెప్ట్ రొటీన్ గా అనిపించినా, దాన్ని ఎంత ఎంగేజింగ్ గా తీర్చిదిద్దారనే దానిపైనే సినిమా ఫలితం ఆధారపడి ఉంటుంది. టీజర్ లో ప్రధాన బలం శర్వానంద్ లుక్ అనే చెప్పాలి. చాలా రోజుల తర్వాత యంగ్ గా, ఎనర్జిటిక్ గా కనిపిస్తున్నాడు. కామెడీ టైమింగ్ లో శర్వాకు మంచి పట్టు ఉంది. అయితే డైరెక్టర్ రామ్ అబ్బరాజు ఈసారి పూర్తిగా సిచువేషనల్ కామెడీ మీద డిపెండ్ అయినట్లు తెలుస్తోంది.




# అమెరికాలో 'శంబాల' సౌండ్

డిఫరెంట్ కాన్సెప్ట్ తో వస్తే చాలు, ఓవర్సీస్ ఆడియెన్స్ రెడ్ కార్పెట్ వేస్తున్నారు. హనుమాన్, విరూపాక్ష, కాంతార లాంటి సినిమాలు నేర్పిన పాఠం ఇదే. ఇప్పుడు 'శంబాల' కూడా అదే దారిలో వెళుతున్నట్లు కనిపిస్తోంది. ఆది ఈసారి కంటెంట్ ని నమ్ముకుని చేసిన ప్రయోగం ఫలించేలా ఉంది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న వస్తున్న ఈ సినిమా, ఆదికి ఒక మెమరబుల్ హిట్ ఇచ్చేలా ఉంది. ప్రీమియర్స్ టాక్ కనుక పాజిటివ్ గా వస్తే, లాంగ్ రన్ లో మంచి లాభాలు రావడం ఖాయం. ఇన్నాళ్లు ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్న ఆదికి, రిలీజ్ కి ముందే వచ్చిన ఈ ఓవర్సీస్ బజ్ ఫుల్ కిక్ ఇస్తోంది. ఇక బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.




# అవతార్3.. నో మ్యాజిక్




జేమ్స్ కామెరూన్ అవతార్ ఫ్రాంచైజీలో మొదటి రెండు భాగాలు కలిపి 5 బిలియన్ల వసూలు చేయడం ఒక సంచలనం. తొలి రెండు చిత్రాలు ఒక్కొక్కటి 2 బిలియన్ల పైగా వసూలు చేసాయి. అయితే అవతార్ 3 విషయంలో అలాంటి మ్యాజిక్ జరగకపోవడం తీవ్రంగా నిరాశపరుస్తోంది. నిజానికి ప్రమోషన్స్ లో అవతార్ 1, అవతార్ 2 రెండిటిని కలిపితే ఎంత భారీ తనం ఉంటుందో అంతకుమించి భారీ విజువలైజేషన్ ప్రజల్ని అబ్బురపరుస్తుందని కామెరూన్ అన్నారు. కానీ అవతార్ 3 చూశాక క్రిటిక్స్ పెదవి విరిచేసారు. కామెరూన్ చిత్రానికి ఊహించని విధంగా మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. అవతార్ -ఫైర్ అండ్ యాష్ బాక్సాఫీస్ వద్ద ఆశించినంత దూకుడును కనబరచలేదు. ఈ సినిమా ముందస్తు హైప్ దృష్ట్యా భారీ ఓపెనింగులు సాధిస్తుందని భావించినా కానీ అది సాధ్యపడలేదు. కనీసం యానిమేషన్ సినిమా రికార్డును కూడా ఈ ఏడాది ఈ చిత్రం బ్రేక్ చేయలేకపోయిందని ట్రేడ్ విశ్లేషిస్తోంది.

# బన్నీ- అట్లీ.. ఏం జరుగుతోంది?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో ఓ భారీ పాన్ వరల్డ్ మూవీని చేస్తున్న విషయం తెలిసిందే. ఏఏ22ఎక్స్ఏ6 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ మూవీలో బన్నీకి జోడీగా బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ దీపికా పదుకునే నటిస్తోంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీకి హాలీవుడ్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్నారు. సూపర్ హీరో స్టోరీగా రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్‌కు ఇటీవల బ్రేక్ ఇచ్చారు. దీంతో బన్నీ ఫ్యామిలీతో కలిసి హాలీడేస్‌ని అమెరికాలో ఎంజాయ్ చేస్తున్నాడు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ తరువాతే బన్నీ ఫ్యామిలీ జనవరిలో ఇండియాకు తిరిగి రానున్నారు. డైరెక్టర్ అట్లీ కూడా క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల కోసం రెడీ అవుతున్నాడు.





# బుట్ట బొమ్మకు కలిసొస్తోందా?

బుట్ట బొమ్మ పూజా హెగ్డే తెలుగులో గ్యాప్ తీసుకున్నా తమిళ, హిందీ భాషల్లో ఆఫర్లు అందుకుంటోంది. రాధే శ్యాం తర్వాత మహేష్ బాబు గుంటూరు కారం సినిమాకు ముందు సైన్ చేసిన అమ్మడు ఆ తర్వాత ప్రాజెక్ట్ నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి అమ్మడికి తెలుగులో అవకాశాలు లేవు. స్టార్ ఛాన్స్ లే కాదు మీడియం రేంజ్ హీరోలు కూడా పూజాని తీసుకోలేదు. ఐతే ఈ టైంలో పూజా హెగ్డేకి తమిళ పరిశ్రమ అండగా ఉంది. సూర్యతో రెట్రో చేసిన అమ్మడు అది రిజల్ట్ ఎలా ఉన్నా కూడా మరో రెండు ఛాన్స్ లు ఇచ్చింది. తమిళ్ లో ప్రస్తుతం లారెన్స్ తో కాంచన 4, దళపతి విజయ్ తో జన నాయగన్ చేస్తుంది. ఈ రెండింటితో పాటు ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా చేస్తున్న సినిమాలో ఛాన్స్ పట్టేసింది. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నెలకుడితి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమాలో పూజా బేబ్ హీరోయిన్ గా నటిస్తుంది. ఎస్.ఎల్.వి బ్యానర్ లో సుధాకర్ చెరుకూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇదే కాకుండా బాలీవుడ్ లో హై జవాని తో ఇష్క్ హెూనా హై సినిమా కూడా చేస్తుంది అమ్మడు. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా సెట్స్ మీద ఉంది. బాలీవుడ్ లో స్టార్ రేంజ్ కోసం ట్రై చేసిన పూజా హెగ్డే అక్కడ వరుస సినిమాలు చేస్తున్నా పెద్దగా క్రేజ్ రాలేదు.

# కియరా.. నాడియా లుక్కు కేక

కె.జి.ఎఫ్ స్టార్ యష్ హీరోగా గీతూ మోహన్ దాస్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమా టాక్సిక్. ఈ సినిమాలో కియరా అద్వాని హీరోయిన్ గా నటిస్తుంది. కన్నడతో పాటు ఇంగ్లీష్ లో కూడా ఈ సినిమా రిలీజ్ చేస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ అవబోతున్న ఈ సినిమా మార్చి 19న రిలీజ్ డేట్ లాక్ చేశారు. ఐతే ఈ సినిమా నుంచి హీరోయిన్ కియరా అద్వాని ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. కియరా అద్వాని సినిమాలో నాడియా రోల్ లో నటిస్తున్నారు. ఆమె ఫస్ట్ లుక్ సినిమాపై అంచనాలు పెంచేసింది. కియరా ఇప్పటివరకు కనిపించని కొత్త లుక్ తో నాడియా రోల్ లో కనిపించబోతుంది. అంతేకాదు సినిమాలో ఈ రోల్ చాలా కీలకమని తెలుస్తుంది. టాక్సిక్ సినిమాను యష్ తో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. కె.జి.ఎఫ్ తో నేషనల్ వైడ్ గా సూపర్ పాపులారిటీ తెచ్చుకున్న యష్ నెక్స్ట్ రాబోతున్న టాక్సిక్ తో అదరగొట్టాలని చూస్తున్నాడు. ఈ సినిమా నుంచి అప్పట్లో ఒక టీజర్ రాగా అది ఇంప్రెస్ చేసింది. ఇక టాక్సిక్ నుంచి కియరా లుక్ ఇంట్రెస్ట్ ని డబల్ చేసింది.

## రోహిత్ వల్లే గిల్‌పై వేటు: అశ్విన్

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కారణంగానే టీ20 ప్రపంచకప్ 2026 జట్టులో శుభ్‌మన్ గిల్‌కు చోటు దక్కలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ హయాంలోనే టీమిండియా పవర్ ప్లేలో దూకుడుగా ఆడటం మొదలుపెట్టిందని, ఆ శైలికి తగ్గట్లు గిల్ ఆడలేకపోయాడని తెలిపాడు. భారత దూకుడైన శైలికి సంజూ శాంసన్, అభిషేక్ శర్మలు సరిగ్గా సరిపోతారని చెప్పాడు. శుభ్‌మన్ గిల్ కోసం ఓపెనర్‌గా అద్భుతంగా ఆడిన సంజూ శాంసన్‌ను తప్పించి అవకాశం ఇచ్చారు. ఆసియా కప్‌లో గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగగా.. సంజూ మిడిలార్డర్‌లో ఆడారు. ఇద్దరూ పేలవ ప్రదర్శన కనబర్చారు. ఆ తర్వాత సౌతాఫ్రికాతో గిల్ ఓపెనర్‌గా ఆడగా.. సంజూపై వేటు పడింది.




# ఆ రోజే రిటైర్ అవ్వాలనుకున్నా
## : రోహిత్ శర్మ

ఈవార్తలు: 2023 నవంబర్ 19న అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ ఓటమి భారత క్రికెట్ అభిమానులనే కాకుండా, స్వయంగా కెప్టెన్ రోహిత్ శర్మను కూడా కోలుకోలేని దెబ్బ తీసింది. ఆ సమయంలో ఆయన అనుభవించిన వేదన, ఆ తర్వాత సాధించిన విజయాల వెనుక ఉన్న పట్టుదల నిజంగా స్ఫూర్తిదాయకం. 2023 ప్రపంచ కప్ ఓటమి తర్వాత పూర్తిస్థాయిలో రిటైర్ అవ్వాలని తీవ్రంగా ఆలోచించినట్లు టీమిండియా స్టార్ క్రికెటర్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ వెల్లడించారు. “ఇక నా దగ్గర ఇచ్చేందుకు ఏమీ లేదు” అనే భావనతో ఉన్నానని ఆయన తెలిపారు. అయితే ఆ మానసిక పోరాటాన్ని అధిగమించి, భారత్‌ను 2024 టీ20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజయాల వైపు నడిపించారు. 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ పరాజయం పాలు కావడంతో కెప్టెన్ రోహిత్‌కు ఛాంపియన్‌షిప్ కల దూరమైంది. ఈ ఓటమి తనలోని సర్వం హరించుకుపోయిందని ఆయన తెలిపారు. ఆ పరాభవం తర్వాత వారాలపాటు అన్నింటికి దూరంగా ఉన్నానని.. అది తన క్రికెట్ జీవితంలోని చీకటి దశగా పేర్కొన్నారు.

# అగార్కర్.. నీ గుండె గొప్పది
## : కృష్ణమాచారి శ్రీకాంత్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కోసం ఎంపిక చేసిన భారత జట్టులో వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ లేకపోవడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు. శుభ్‌మన్ గిల్‌ను జట్టు నుంచి తప్పిస్తారని తాను అస్సలు ఊహించలేదని, ఇది సాహసోపేత నిర్ణయమని కొనియాడాడు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ గొప్ప నిర్ణయం తీసుకున్నాడని ప్రశంసించాడు. అంతేకాకుండా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సత్తా చాటిన ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడం గొప్ప విషయమని అభిప్రాయపడ్డాడు. ‘శుభ్‌మన్ గిల్‌ను తప్పించడం చూసి షాక్ అయ్యాను. ఇది చాలా మంచి నిర్ణయం. భారత జట్టు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌ను తప్పిస్తారని నేను అస్సలు ఊహించలేదు. ఆస్ట్రేలియా పర్యటనలో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా ఆడాడు. తాజాగా జట్టులోకి రింకూ సింగ్, ఇషాన్ కిషన్ వచ్చారు. ఇషాన్ కిషన్ చాలా రోజులుగా భారత జట్టులో లేడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శన చేయడంతో అతనికి అవకాశం ఇచ్చారు. నిజంగా ఇది మంచి నిర్ణయం. ఈ విషయంలో నేను అజిత్ అగార్కర్‌తో పాటు మిగిలిన సెలెక్టర్లను అభినందిస్తున్నా. శుభ్‌మన్ గిల్ వన్డే, టెస్ట్ క్రికెట్‌లో అద్భుతమైన ఆటగాడు. ఇషాన్ కిషన్ ఎంపిక చాలా సంతోషాన్నిచ్చింది. వన్డే క్రికెట్‌లో అతనికి డబుల్ సెంచరీ ఉంది. వన్డే ప్రపంచకప్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. అతను ఆకస్మాత్తుగా భారత జట్టుకు దూరమయ్యాడు.’అని శ్రీకాంత్ పేర్కొన్నాడు.

# డఫీ పాంచ్ పటాకా

### విండీస్‌పై మూడో టెస్టులో కివీస్ విజయం

వెస్టిండీస్‌తో ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మూడో టెస్టులో న్యూజిలాండ్ 323 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 2-0తో కైవసం చేసుకుంది. చివరి వరకు నువ్వానేనా అన్నట్లు తలపడ్డ పోరులో విండీస్‌పై కివీస్‌దే పైచేయి అయ్యింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 462 పరుగుల లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 43/0తో సోమవారం బ్యాటింగ్‌కు దిగిన విండీస్..జాకబ్ డఫీ(5/42) ధాటికి 138 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్(67) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. గాయాలతో ప్రధాన బౌలర్లు సిరీస్‌కు దూరమైన వేళ అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ డఫీ తనదైన పేస్‌తో విండీస్ భరతం పట్టాడు. నిప్పులు చెరిగే స్వింగ్‌తో విండీస్ బ్యాటర్లకు చుక్కలు చూపెట్టాడు. బ్రాండ్‌కింగ్‌తో మొదలైన డఫీ వికెట్ల వేట జేడన్ సీల్స్(0)తో ముగిసింది. ఈ క్రమంలో ఒక ఏడాది టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన రిచర్డ్ హ్యాడ్లీ(80) రికార్డును డఫీ తాజాగా అధిగమించాడు. కాన్వెకు ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’, డఫీకి ‘మ్యాన్ ఆఫ్ ద సిరీస్’ దక్కాయి.



# మహిళా క్రికెట్‌కు మహర్దశ

### దేశవాళీలో ఒక్క మ్యాచ్‌కు 50వేలు

న్యూఢిల్లీ : దేశంలో మహిళా క్రికెట్‌కు మహర్దశ రాబోతున్నది. స్వదేశం వేదికగా ఇటీవల ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్ టోర్నీలో భారత్ టైటిల్ విజేతగా నిలిచిన నేపథ్యంలో మహిళా క్రికెట్‌కు పెద్దపీట వేసేందుకు బీసీసీఐ సిద్ధమైంది. మహిళల దేశవాళీ టోర్నీలకు మరింత ప్రాధాన్యం కల్పిస్తూ బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్తగా ఆమోదం పొందిన వాటిలో ఇప్పటి నుంచి దేశవాళీ టోర్నీల్లో ఆడే సీనియర్ మహిళా క్రికెటర్లు రోజుకు రూ.50వేలు పొందనున్నారు. గతంలో ఉన్న(రూ.20వేలు) దానికంటే ఇది రెండింతలు ఎక్కువ కావడం విశేషం. తుది జట్టులో ఉండే ప్లేయర్లకు 50వేలు దక్కనుండగా, రిజర్వ్ ప్లేయర్లకు అందులో సగం రూ.25వేలు లభించనున్నాయి. ఇక జాతీయ టీ20 టోర్నీలో ఫైనల్ లెవన్ ప్లేయర్లకు మ్యాచ్ ఫీజు కింద రూ.25వేలు, రిజర్వ్ ప్లేయర్లకు 12, 500లు పొందనున్నారు. దీని ద్వారా దేశవాళీ టోర్నీ సీజన్ మొత్తంగా అన్ని ఫార్మాట్లు ఆడితే ఒక్కో ప్లేయర్ రూ.12 లక్షల నుంచి 14 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశముంది. మరోవైపు అండర్-19, అండర్-23 టోర్నీల్లో ఆడే మహిళా ప్లేయర్లు రోజుకు రూ.25వేలు, రిజర్వ్ ప్లేయర్లకు రూ.12,500వేలు లభించనున్నాయి. కొత్త స్కీమ్‌లో మ్యాచ్ అంపైర్లు, రిఫరీలు ఒక్క రోజుకు రూ.40వేలు పొందనున్నారు. అయితే టోర్నీలో కీలక మ్యాచ్‌లకు ఇది రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఉండనుంది. దీని ద్వారా రంజీ ట్రోఫీలో ఒక మ్యాచ్‌కు దాదాపు రూ.1.60లక్షలు దక్కే అవకాశముండగా, నాకౌట్‌లకు ఇది రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు ఉంటుంది.




# కొత్త ఏడాదిలో టీమిండియా వేట

ఈవార్తలు: సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్ విజయంతో ఈ ఏడాదిని టీమిండియా ఘనంగా ముగించింది. వచ్చే ఏడాదే టీమిండియా తదుపరి సిరీస్ ఆడనుంది. జనవరి 11 నుంచి సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్, జనవరి 21 నుంచి ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు ఇదే చివరి టీ20 సిరీస్ కావడం గమనార్హం. దాంతో ఈ సిరీస్‌లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సౌతాఫ్రికాతో సిరీస్ అనంతరం టీమిండియా ఆటగాళ్లకు 20 రోజుల విశ్రాంతి లభించింది. ప్రస్తుతం ఆటగాళ్లంతా స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఇందులో కొందరు విజయ్ హజారే ట్రోఫీ ఆడనుండగా.. మరికొందరు విశ్రాంతి తీసుకోనున్నారు. జనవరి 11 నుంచి ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా మాజీ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నారు. జనవరి 11 వడదోరా వేదికగా



తొలి మ్యాచ్ జరగనుండగా.. జనవరి 14న రాజ్‌కోట్ వేదికగా రెండో వన్డే, జనవరి 18న ఇండోర్ వేదికగా మూడో వన్డే జరగనుంది. వన్డే మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జనవరి 21 నుంచి ప్రారంభం కానుంది. జనవరి 21న నాగ్‌పూర్‌లో తొలి టీ20, జనవరి 23న రాయ్‌పూర్ వేదికగా రెండో టీ20, జనవరి 25న గువహతి వేదికగా మూడో టీ20, జనవరి 28న విశాఖపట్నంలో నాలుగో టీ20, జనవరి 31న తిరువనంతపురంలో ఐదో టీ20 జరగనుంది.



# కృష్ణప్ప గౌతమ్ రిటైర్మెంట్

ఈవార్తలు:ఐపీఎల్ ఛాంపియన్, కర్ణాటక ప్లేయర్ కృష్ణప్ప గౌతమ్ అన్ని ఫార్మాట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సోమవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి తన నిర్ణయాన్ని వెల్లడించాడు. కర్ణాటకు చెందిన 37 ఏళ్ల కృష్ణప్ప గౌతమ్ భారత జట్టు తరఫున ఏకైక వన్డే మ్యాచ్ ఆడాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో ఈ స్పిన్ ఆల్‌రౌండర్ బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో గౌతమ్ ఒక వికెట్ తీయడంతో ఒక పరుగు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో కర్ణాటక తరఫున 59 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 224 వికెట్లు తీసాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో 59 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు పడగొట్టాడు. 2017లో ముంబై ఇండియన్స్‌తో తన ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించిన కృష్ణప్ప గౌతమ్.. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్, సీఎస్‌కే జట్లకు ఆడాడు. మొత్తం 36 మ్యాచ్‌ల్లో 247 పరుగులతో పాటు 21 వికెట్లు పడగొట్టాడు. 2017లో ముంబై అతన్ని రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో ముంబై ఛాంపియన్‌గా నిలవగా.. గౌతమ్‌కు ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం దక్కలేదు. 2018లో రాజస్థాన్ రాయల్స్ అతన్ని రూ.6.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేయగా 15 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి 126 పరుగులు చేశాడు. 2019లో ఆ జట్టు తరఫున ఒకే ఒక్క వికెట్ తీసి 11 పరుగులే చేశాడు. 2020లో పంజాబ్ కింగ్స్ ట్రేడ్ చేసుకోగా.. ఆ జట్టు తరఫున 2 మ్యాచ్‌లే ఆడి 42 పరుగులతో పాటు ఒక వికెట్ తీసాడు. ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని రూ.9.25 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో ఓ అనామక ప్లేయర్ అంత ధర పలకడం రికార్డ్. 2021లో సీఎస్‌కే ఛాంపియన్‌గా నిలవగా.. గౌతమ్ ఆ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. విచిత్రం ఏంటంటే 2017లో ముంబై ఇండియన్స్ తరహాలోనే సీఎస్‌కే తరఫున ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం దక్కలేదు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
మంగళవారం 23-12-2025
www.evarthalu.com

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు ఒత్తిళ్లని ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో, ముఖ్యంగా బలహీనమైన మౌలిక సదుపాయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్న సమయంలో భారతదేశపు గ్రామీణ ఉపాధి హామీ పథకం పురుడు పోసుకుంది. రెండు దశాబ్దాల తర్వాత స్థూల ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుతం పేదరికం తగ్గింది. గ్రామీణ అనుసంధానత మెరుగుపడింది. ఆర్థిక సమ్మిళిత్వం పెరిగింది. అయినప్పటికీ ప్రభుత్వ ఉపాధికి డిమాండు ఉంది. అయితే దీనికి కారణం పేదరికం మాత్రమే కాదు. అసమాన ప్రాంతీయ వృద్ధి, వాతావరణ అస్థిరత, జీవనోపాధికి ఉన్న ముప్పు కూడా దీనిని ప్రభావితం చేస్తున్నాయి. ఉపాధి హామీ చట్రం నుంచి వెనక్కి తగ్గకుండానే సంస్కరణలు చేపట్టాలన్న విషయాన్ని ఇది స్పష్టం చేస్తోంది.



# గ్రామీణ ఉపాధిపై పునరాలోచన



ప్రొఫెసర్ జ్యోతిస్ సత్యపాలన్
ఎన్ఐఆర్‌డీపీఆర్
రచయిత: జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ ప్రొఫెసర్

స్థూల ఆర్థిక కోణం నుంచి చూస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్థిరపరచడంలో వేతన-ఉపాధి కార్యక్రమాలు సుదీర్ఘకాలంగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక మందగమనం ఉన్నప్పుడు ఇవి వినియోగాన్ని క్రమబద్ధీకరిస్తాయి. తప్పనిసరిగా వెళ్లాల్సిన వలసలను తగ్గిస్తాయి. కొన్ని కాలాలకే ఉపాధి పరిమితమైన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు మద్దతును అందిస్తాయి. జీడీపీలో వ్యవసాయం వాటా తగ్గినప్పటికీ ఇప్పటికీ ఎక్కువ భాగం శ్రామిక శక్తి దీనిపైనే ఆధారపడి ఉంది. అదే సమయంలో స్థిరమైన ప్రత్యామ్నాయాలను అందించే స్థాయిలో గ్రామీణ వ్యవసాయేతర ఉపాధి సృష్టి వేగంగా జరగలేదు. ప్రభుత్వ ఉపాధి నేటికీ అనేక మందికి దన్నుగా ఎందుకు ఉందన్నది ఈ నిర్మాణపరమైన అసమతౌల్యం కళ్లకు కడుతుంది. వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లు - 2025 ప్రయోజనం... గ్రామీణ ఉపాధిని ఒక విస్తృతమైన స్థూల ఆర్థిక చట్రంతో అనుసంధానించడం. దీనిని కేవలం సంక్షేమ వ్యయంగా చూడకుండా వికసిత్ భారత్ 2047 దీర్ఘకాలిక వృద్ధి దృక్పథానికి అనుగుణంగా ఉత్పాదకత, ఆస్తుల కల్పన, వివిధ పథకాల మధ్య సమన్వయంతో జీవనోపాధి భద్రత అందించాలని సూచిస్తోంది.

గ్రామీణ వేతన ఉపాధి అవసరం ఇంకా ఉందని గత రెండు దశాబ్దాల అనుభవం చెబుతోంది. దీర్ఘకాలిక పేదరికం తగ్గినప్పటికీ గ్రామీణ కుటుంబాలలో అధిక భాగం ఇప్పటికీ మార్కెట్ హెచ్చుతగ్గులు, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, వాతావరణ మార్పులకు సంబంధించిన ముప్పులకు గురవుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వర్షాధార, గిరిజన, కరువు పీడిత ప్రాంతాల్లో ప్రభుత్వ ఉపాధి కోసం డిమాండు ఎక్కువగా ఉంటోంది. ఇది శాశ్వత పేదరికం కంటే ఎక్కువగా ఆదాయంలో ఉండే అస్థిరతను తెలియజేస్తోంది. చట్టబద్ధమైన హక్కు, వాస్తవ అమలుకు మధ్య నిరంతర వ్యత్యాసం ఉన్నట్లు ఉపాధి హామీ పథకం ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధికి చట్టం హామీ ఇస్తున్నప్పటికీ చాలా ఏళ్ల పాటుగా అందించిన సగటు పని దినాల సంఖ్య ఈ పరిమితి కంటే చాలా తక్కువగానే ఉంది. ఇది ఆర్థిక మందగమనం సమయంలో గ్రామీణ డిమాండ్‌కు మద్దతునిచ్చే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఈ నేపథ్యంలో చట్టబద్ధమైన హామీని ప్రతి కుటుంబానికి 100 నుంచి 125 రోజులకు పెంచటాన్ని ఒక భారీ స్థూల-ఆర్థిక జోక్యంగా చెప్పుకోవచ్చు. ఇది బలహీన వర్గాల కుటుంబాలకు ఆదాయ భరోసాను మెరుగుపరుస్తుంది. చక్రీయంగా ఖర్చు చేయాలన్న విధానానికి భిన్నంగా ప్రభుత్వ పాత్రను ఇది బలోపేతం చేస్తుంది. వ్యవసాయ మందగమనం లేదా వాతావరణ ప్రతికూలతలు ఉన్న సమయాల్లో ఇటువంటి విస్తరణ స్థానిక ఆర్థిక వ్యవస్థలు కుంచించుకుపోకుండా వినియోగాన్ని కొనసాగించేందుకు ఉపయోగపడుతుంది.

గత అనుభవాల నుంచి నేర్చుకున్న ఒక ముఖ్యమైన ఆర్థిక విషయం ఏంటంటే.. గ్రామీణ ఉపాధిని ఆస్తుల కల్పనతో ముడిపెట్టినప్పుడు అది మరింత బలమైన ఫలితాలను ఇస్తుంది. కాలక్రమేణా నీటి సంరక్షణ, భూ అభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ పనుల ద్వారానే అధిక శాతం ఉపాధి సృష్టి జరుగుతుంది. ఈ పెట్టుబడులు పంటల సాగు తీవ్రతను పెంచడం, భూగర్భ జలాల మట్టాలను స్థిరపరచడం, కరువు ముప్పును తగ్గించడం వంటి అదనపు ప్రయోజనాలను అందించాయి. కొత్త విధానం నీటి భద్రత, ప్రధాన గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధికి సంబంధించిన ఆస్తులు, వాతావరణ దృఢత్వం గల పనులను ఉపాధి ప్రణాళికలో కేంద్ర బిందువుగా ఉంచింది. ఉపాధి వ్యయాన్ని కేవలం రెవెన్యూ వ్యయంగా చూడటం నుంచి వికేంద్రీకృత ప్రభుత్వ పెట్టుబడిగా గుర్తించడం వైపు జరిగిన ఒక పెద్ద మార్పును ఇది తెలియజేస్తోంది. ఆర్థిక దృక్కోణంలో ఇది ప్రభుత్వ వ్యయం విషయంలో ఉత్పత్తి విలువను పెంచుతుంది.. మధ్యకాలిక వృద్ధికి మద్దతు ఇస్తుంది. ఆస్తులపై దృష్టి సారించే ఉపాధి విధానం అనేది వెనుకబడిన ప్రాంతాలు పదేపదే ఉపశమన వ్యయంపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా భవిష్యత్తులో ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. ఈ విధంగా ఈ బిల్లు స్వల్పకాలిక ఆదాయ మద్దతును దీర్ఘకాలిక ఉత్పాదక లాభాలతో అనుసంధానిస్తుంది.

గతంలో ప్రణాళిక అమలులో ఏకరీతి ఉండేది కాదు. ఇది అప్పటి ఉపాధి చట్టానికి ఉన్న మరొక పరిమితి. విడివిడి పథకాల ఆధారంగా సాగే పనులు వాటి స్థాయిని పరిమితం చేయడమే కాకుండా ఆస్తుల నాణ్యతను కూడా దెబ్బతీశాయి. ఉపాధి పనులను సమగ్ర గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చడం ద్వారా 'వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు ఈ సమస్యను పరిష్కరిస్తాయి. జియో స్పేషియల్ సాధనాలను ఉపయోగించి తయారు చేసిన, జాతీయ ప్రణాళికా వేదికలతో అనుసంధానమైన ఈ ప్రణాళికలు మౌలిక సదుపాయాలు, నీరు, గృహనిర్మాణం, జీవనోపాధి పెట్టుబడుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరుస్తాయి. పనులన్నింటినీ ఒకే గ్రామీణ మౌలిక సదుపాయాల చట్రంలోకి చేర్చడం వల్ల వనరుల దుర్వినియోగం తగ్గుతుంది. ప్రభుత్వ పెట్టుబడి సామర్థ్యం పెరుగుతుంది. ఈ విధానం గ్రామీణ ఉపాధిని ఒక సమాంతర వ్యవస్థగా కాకుండా విస్తృత అభివృద్ధి ప్రక్రియలో భాగంగా మారుస్తుంది. పంట విత్తే, కోత కోసే కీలక సమయాల్లో 60 రోజుల వరకు ప్రభుత్వ పనులను నిలిపివేసేందుకు రాష్ట్రాలకు అవకాశం కల్పించడం వల్ల కార్మిక మార్కెట్‌పై స్పష్టమైన సానుకూల ప్రభావం ఉంటుంది. ఈ కాలంలో వ్యవసాయ కూలీలకు డిమాండు పెరిగి మార్కెట్ వేతనాలు కూడా పెరుగుతాయి. అదే సమయంలో భారీగా ప్రభుత్వ పనులు నిర్వహిస్తే అది కూలీల లభ్యతపై ఒత్తిడి పెంచి రైతులకు పెట్టుబడి ఖర్చులు పెంచుతుంది. తద్వారా దిగుబడిపై ప్రభావం పడటానికి దారితీస్తుంది. సమయానుకూలంగా స్థానికంగా నిర్ణయించే ఈ విరామం.. వ్యవసాయ పనులకు ప్రభుత్వ ఉపాధి అడ్డంకిగా మారకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వార్షిక ఉపాధి హామీ దినాల పెంపు ఈ కాలంలో తగ్గిన పని దినాలను భర్తీ చేస్తుంది. ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ పనుల ఉత్పాదకత, వేతన ఆదాయాన్ని రెండింటినీ కాపాడుతూ పనుల లేని కాలంలో ఉపాధిని సమానంగా అందించవచ్చు.

ఆర్థిక అంచనాలను మెరుగుపరిచేందుకు ఈ బిల్లు నిబంధనల ఆధారిత కేటాయింపులను (నార్మేటివ్ అలోకేషన్) ప్రవేశపెడుతోంది. ఇది నిధుల రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడం, రియాక్టివ్ బడ్జెటింగ్ వంటి సమస్యలను పరిష్కరిస్తూ మధ్యకాలిక ఆర్థిక చట్రంలో ఉపాధి వ్యయాన్ని ప్రణాళిక చేసుకునేందుకు రాష్ట్రాలకు వీలు కల్పిస్తుంది. ఉమ్మడి ఆర్థిక బాధ్యత కూడా ఆస్తుల ఎంపికను మెరుగుపరచటం, వాటి నిర్వహణను ప్రోత్సహిస్తుంది. అదే సమయంలో నిధులు సమానంగా అందించటంపై ఉన్న ఆందోళనలను పరిష్కరించేందుకు పారదర్శక కేటాయింపు ప్రమాణాలు, సకాలంలో నిధుల విడుదల, ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలకు రక్షణ కవచాలు అవసరం. డిజిటల్ పర్యవేక్షణ, బహిరంగ ప్రకటనలు, బలోపేతం చేసిన సామాజిక తనిఖీలపై పెట్టిన ప్రాధాన్యత అనేవి వ్యయ క్రమశిక్షణను మెరుగుపరచడం, సేవలు అందించే వ్యవస్థలపై నమ్మకాన్ని పునరుద్ధరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

వేతనాల ప్రకటన, పని కల్పించని పక్షంలో నిరుద్యోగ భృతి వంటి వాటితో సహా ఉపాధి హామీకి సంబంధించిన హక్కులు ఈ బిల్లులో యథాతథంగా ఉన్నాయి. అయితే ఈ హక్కులను అందించే చట్రం మాత్రమే మారుతోంది. వాతావరణ ముప్పులు, అసమాన వృద్ధి, కార్మిక మార్కెట్ పరిమితులతో కూడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ ఉపాధి అనేది ఇప్పటికీ ఒక అవసరమైన స్థూల-ఆర్థిక సాధనంగా ఉంది. హక్కులను విస్తరించడం, ప్రణాళికా సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ఆస్తుల నాణ్యతను పెంచడం, ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడం ద్వారా ఈ కొత్త విధానం గ్రామీణ ఉపాధికి ఉన్న అసలు లక్ష్యాన్ని పునరుద్ధరించాలనే ఉద్దేశంతో ఉంది. మారుతున్న స్థూల ఆర్థిక ముఖచిత్రంలో అనుభవం ఆధారంగా వచ్చే సంస్కరణలు అంటే వెనక్కి వెళ్లినట్లు కాదు.. ఇదొక పునరుద్ధరణ అవుతుంది.

# సుస్థిర వ్యవసాయం వైపు ప్రయాణం

దేశవ్యాప్తంగా సుస్థిర వ్యవసాయ విధానం భారత వ్యవసాయ భవిష్యత్తుకు కీలక మార్గంగా రూపుదిద్దుకుంటోంది. వాతావరణ మార్పుల ప్రభావం, నీటి కొరత, మట్టి నాణ్యత క్షీణత, సాగు ఖర్చుల పెరుగుదల వంటి సవాళ్లు ఎదురవుతున్న వేళ ఉత్పత్తి పెంపుతో పాటు వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే విధానాల వైపు దేశం కదులుతోంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2024 నాటికి దేశంలో వ్యవసాయ రంగం జిడిపిలో సుమారు 18 శాతం వాటా కలిగి ఉండగా దాదాపు 45 శాతం ప్రజలకు జీవనాధారం అందిస్తోంది. ఈ విస్తృత జనాభా భవిష్యత్తును సురక్షితంగా నిలబెట్టాలంటే సుస్థిరత తప్పనిసరి అంశంగా మారింది.

భారతదేశంలో మొత్తం వినియోగించే నీటిలో సుమారు 80 శాతం వ్యవసాయ రంగానికే ఖర్చవుతుండటం గమనార్హం. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు 2024 నివేదిక ప్రకారం దేశంలోని 7,000కు పైగా బ్లాక్‌లలో దాదాపు 17 శాతం ప్రాంతాలు అతివినియోగ స్థితిలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వరి, చెరకు వంటి అధిక నీటి పంటలపై ఆధారపడటం దీర్ఘకాలంలో ప్రమాదకరమని నిపుణుల హెచ్చరిక. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజల సాగుకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నీటి వినియోగాన్ని 30 నుంచి 50 శాతం వరకు తగ్గించవచ్చని ఐసిఏఆర్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. సుస్థిర వ్యవసాయ విధానంలో ఆర్థిక అంశం కూడా కీలకం. నాబార్డ్ 2023 అంచనాల ప్రకారం సేంద్రీయ సాగు లేదా తక్కువ ఇన్పుట్ వ్యవసాయం చేపట్టిన





డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

రైతుల నికర ఆదాయం సగటున 20 నుంచి 25 శాతం పెరిగింది. రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో మట్టి ఆరోగ్యం మెరుగుపడటం సాగు స్థిరత్వానికి దోహదపడుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024 నాటికి దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల హెక్టార్లలో సేంద్రీయ సాగు అమలులో ఉంది. పోషక భద్రత కోణంలో చూస్తే చిరుధాన్యాల ప్రాధాన్యం మరింత స్పష్టమవుతోంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 డేటా ప్రకారం గ్రామీణ మహిళల్లో 57 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఐరన్, జింక్, ఫైబర్ అధికంగా ఉన్న మిల్లెట్స్ వినియోగం ఈ సమస్యను తగ్గించగలదని పోషక నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల మధ్యాహ్న భోజన పథకాల్లో చిరుధాన్యాల వినియోగాన్ని 2026 నాటికి 25 శాతం వరకు పెంచాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా దేశవ్యాప్తంగా అమలవుతున్న సుస్థిర వ్యవసాయ విధానం నీటి సంరక్షణ, మట్టి ఆరోగ్యం, రైతు ఆదాయం, పోషక భద్రత వంటి అంశాలను సమగ్రంగా అనుసంధానిస్తోంది. 2030 నాటికి తక్కువ నీటి సాగు పంటల విస్తీర్ణాన్ని 20 శాతం పెంచగలిగితే భారత వ్యవసాయం పర్యావరణానికి అనుకూలంగా నిలబడడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన బలాన్ని అందించే దిశగా ముందుకు సాగుతుందని విధాన రూపకర్తలు అంచనా వేస్తున్నారు.

సుస్థిర వ్యవసాయ విధానం దేశవ్యాప్తంగా ఫలప్రదంగా అమలవ్వాలంటే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకంగా మారుతుంది. ఒకే విధమైన విధాన ప్రకటనలకే పరిమితం కాకుండా భౌగోళిక పరిస్థితులు, మట్టి రకాలు, నీటి లభ్యత ఆధారంగా ప్రాంతాల వారీగా ప్రత్యేక సాగు నమూనాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. రైతులకు పంట మార్పిడి వల్ల వచ్చే లాభాలు స్పష్టంగా తెలియజేయకపోతే విధానాలపై విశ్వాసం ఏర్పడదు. అందుకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామ స్థాయిలో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇంకా ముఖ్యంగా రైతులకు మార్కెట్ అనిశ్చితి లేకుండా చేయడం సుస్థిర వ్యవసాయానికి ప్రాణం. కనీస మద్దతు ధరలతో పాటు కాంట్రాక్ట్ ఫార్మింగ్, ఎగుమతి అనుసంధానం వంటి మార్గాలను విస్తరించగలిగితే ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి పెరుగుతుంది. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ఈ కాలంలో పంటల వైవిధ్యం రైతులకు సహజ బీమా లాంటి భరోసాను ఇస్తుంది. ఒక పంట నష్టపోయినా మరో పంట ఆదాయాన్ని నిలబెట్టే అవకాశాన్ని కల్పిస్తుంది. సుస్థిర వ్యవసాయ విధానం ద్వారా గ్రామీణ యువతకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ ఆధారిత ఉత్పత్తులు, స్టార్టప్‌ల రూపంలో వ్యవసాయానికి అనుబంధ ఉపాధి రంగాలు విస్తరిస్తున్నాయి. దీని వల్ల గ్రామాల నుంచి పట్టణాలకు వలస తగ్గే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఈ విధానం అమలైతే భారతదేశం ఆహార భద్రతలో మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా ప్రపంచానికి మార్గదర్శకంగా నిలబడే అవకాశముంది. అందుకే సుస్థిర వ్యవసాయం నేటి అవసరం మాత్రమే కాదు భవిష్యత్తు తరాల కోసం దేశం తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయంగా భావించాల్సిన అంశంగా నిలుస్తోంది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.